LN MEDIA PUBLICATION PVT LTD

MV NEWS మన మీ వార్త

@vaartanews @mvnewstv

# మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

www.mivaartanews.com

TGBIL/25/A0512

హైదరాబాద్

సోమవారం 24 ఆగస్టు 2026

సంపుటి : 02

సంచిక :53

పేజీలు : 12 వెల : 5/-



వార్త

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం

కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు

91-8522888459 9515342857




SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


## డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా



- మోదీ సర్కార్‌పై జైరాం రమేశ్ విమర్శలు
- 'డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం అమిత్ షా 2/3 మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా?'
- లోక్‌సభ ప్రొరోగేషన్ ఆలస్యం వెనుక దురుద్దేశాలు ఉన్నాయా
- కేంద్రంపై జైరాం రమేశ్ ధ్వజం

## పరిశ్రమలకు కొత్త ఊపు



- ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్‌కు ఉంది
- బంగాల్‌లో రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు రాజ్‌నాథ్ శంకుస్థాపన
- జీఆర్‌ఎస్ఈకి మూడు, యంత్ర ఇండియాకు రెండు ప్రాజెక్టులు
- కొత్త ప్రాజెక్టులతో ఉద్యోగాలు, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు పెరుగుతాయి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



## మంత్రి పొన్నంతో చర్చలు సఫలం

- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆటో కార్మికులు
- ఇవాళ్టి అర్ధరాత్రి నుంచి ఆటోలు బంద్ చేస్తామని ప్రకటించిన ఆటో సంఘాల జేఏసీ
- ఆటో కార్మిక సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం
- బంద్ విరమించిన ఆటో కార్మికుల సంఘాలు

హైదరాబాద్

నేటి అర్ధరాత్రి నుంచి ఆటోలు బంద్ చేస్తామని తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి ఆటో జేఏసీ నాయకులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో - మిగతా3లో

# రాయబారులుగా నిలవాలి



- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.
- రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు
- కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని వెల్లడి
- లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైంది
- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలి

హైదరాబాద్

రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్?రెడ్డి ఆరోపించారు. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని చెప్పారు. లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైందన్నారు. అక్కడ నిర్వహించిన అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలు పూర్తయ్యాయని రేవంత్?రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్? చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంశంలో ఊహించని పరిణామం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన ముగించుకొని, ముఖ్యమంత్రి అక్కడి నుంచి నేరుగా అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ ఆయన పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించింది. విదేశాంగ శాఖ నిర్ణయంతో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్న ముఖ్యమంత్రి, అమెరికా వెళ్లకుండానే లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతున్నారు. ఈ మేరకు లండన్ నుంచే సీఎం రేవంత్ ఒక ప్రకటనను విడుదల చేశారు. గత మూడు రోజులుగా లండన్‌లో తమకు లభించిన అపూర్వ మద్దతుకు అందరికీ హృదయపూర్వక - మిగతా3లో

## కేసు నుంచి తప్పించండి
# ఎంతైనా ఇస్తాం!

- జనసేన ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ యాక్సిడెంట్ చేసిన కేసులో పోలీసులతో భారీ మొత్తంలో సెటిల్‌మెంట్
- నిందితుడి కుటుంబం, మాదాపూర్ ఠాణాలో ఓ ఉన్నతాధికారి ఒకే సామాజిక వర్గం కావడంతో సయోధ్య
- అందుకే ఘటన జరిగిన ఐదు రోజులపాటు దాచిపెట్టిన పోలీసులు
- ఎఫ్ఐఆర్‌లో అనుకూల సెక్షన్ల నమోదుపై అధికారులపై రాష్ట్ర పోలీసు బాస్ ఆగ్రహం
- నేడు పోలీసులకు చేరనున్న ఎంవీఐ సమగ్ర నివేదిక



హైదరాబాద్

జనసేన ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు సంజూష్ యాక్సిడెంట్ చేసిన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేసు నుంచి తప్పిస్తే ఎంత పెద్ద మొత్తమైనా ఇస్తామని పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. మాదాపూర్ ఠాణాలో ఓ ఉన్నతాధికారి, లింగమనేని కుటుంబం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో భారీ మొత్తంలో సెటిల్‌మెంట్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 16న హైదరాబాద్‌లో ఇనార్బిట్ మాల్ వద్ద లింగమనేని సంజూష్ తన ఆస్టన్ మార్టిన్ లగ్జరీ కారులో అతివేగంగా దూసుకొచ్చి రోడ్డు దాటుతున్న లైఫ్‌స్టైల్ స్టోర్ ఉద్యోగిని భారతీ ముఖిని ఢీకొట్టడంతో ఆమె మృతి చెందిన సంగతి తెలిసిందే. పోలీసులు ఐదు రోజులపాటు ఈ రోడ్డు ప్రమాదం విషయాన్ని - మిగతా3లో



## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

- కీలక బిల్లు ఆమోదం కోసమేనా? తెర వెనక ఏం జరుగుతోంది?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన ఉభయ సభలు
- పది రోజులు గడిచినా జారీ కాని ప్రొరోగ్ ఉత్తర్వులు
- మహిళా రిజర్వేషన్ అమలుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు చర్చ

## అధిష్టానం వద్దకు 'కొండా' పంచాయితీ

- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకోనున్న ముందు రోజే ఆమె ఏఐసీసీ అధ్యక్షుడితో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం
- అన్ని విషయాలపై వివరణ
- దాదాపు 15 నిమిషాలపాటు ఇద్దరి భేటీ
- సీఎం వచ్చాక మాట్లాడుదామని, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్‌లతో క్షుణ్ణంగా చర్చించాక ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని ఖర్గే చెప్పినట్టు సమాచారం.



హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ అధికారికంగా కాంగ్రెస్ అధిష్టానం వద్దకు చేరింది. ఆదివా రం మధ్యాహ్నం ఆమె బెంగళూరుకు వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. దాదాపు 15 నిమిషాలపాటు ఇద్దరి భేటీ జరిగిందని సమాచారం. అయితే బెంగళూరుకు వెళ్లి ఖర్గేను కలిసిన విషయంలో మంత్రి సురేఖ గోప్యత పాటించడం.. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకోనున్న ముందు రోజే ఆమె ఏఐసీసీ అధ్యక్షుడితో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఖర్గేను కలిసిన సందర్భంగా మంత్రి సురేఖ రాష్ట్రంలో జరుగుతున్న అన్ని - మిగతా3లో


## మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!

- కేంద్రం హామీలపై సీజేపీ కీలక భేటీ
- కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై సోమవారం సీజేపీ సమీక్ష
- ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదని ఆరోపణ



# పరిశ్రమలకు కొత్త ఊపు

ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్‌కు ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నౌకా నిర్మాణ రంగంలో ఏర్పడిన అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవాలని అన్నారు. బంగాల్‌లోని కోల్‌కతా నుంచి గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ), యంత్ర ఇండియా లిమిటెడ్ విస్తరణకు సంబంధించిన రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆదివారం ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో ప్రస్తుతం ఒక రకమైన ఖాళీ ఏర్పడుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. భారత్ ప్రపంచ షిప్‌బిల్డింగ్ హబ్‌గా మారగలదని అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని చెప్పారు. దేశీయంగా యుద్ధ నౌకల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విదేశాలపై ఆధారపడటాన్ని మరింత తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. బంగాల్‌లో పారిశ్రామిక రంగంలో కొత్త మార్పు కనిపిస్తోం దని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గతంలో రాష్ట్రం నుంచి పరిశ్ర మల మూసివేతలు, లాకౌట్ల వార్తలు ఎక్కువగా వచ్చేవని, ఇప్పుడు కొత్త ప్రాజెక్టుల ప్రారంభ వార్తలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులతో పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (మీఎస్ఎంఈ) రక్షణ ఉత్పత్తి రంగంలో భాగస్వాములు కావడానికి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.



**'స్వావలంబనకు ఇవి కీలక అడుగులు'**

దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో రక్షణ రంగానికి కీలక స్థానం ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించిన సప్తధార అభివృద్ధి మార్గాల్లో రక్షణ రంగం కూడా ఒకటని గుర్తుచేశారు. దేశ రక్షణ అవసరాలను సాధ్యమైనంత వరకు దేశీయంగానే తీర్చాలన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థల మౌలిక వసతులను బలోపేతం చేయడం కీలకమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కేవలం నేటి అవసరాల కోసం కాదని, భవిష్యత్తు కోసమని అన్నారు. సుమారు రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని, భారత్ నిర్మాణంలో ఇవి కీలక అడుగులని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

**800కు పైగా నౌకల నిర్మాణం**

జీఆర్ఎస్ఈ పనితీరును రక్షణ మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. సంస్థ ఇప్పటివరకు 800కు పైగా నౌకలను నిర్మించిందని తెలిపారు. అధునాతన సముద్ర నౌకల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచుతూ, విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో జీఆర్?ఎస్?ఈ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇక్కడే ఏఎన్?ఎస్ ద్రోణగిరి వంటి యుద్ధ నౌకలు నిర్మించబడ్డాయని గుర్తుచేశారు. సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న జీఆర్?ఎస్?ఈకి నవరత్న హోదా దక్కడం అభినందనీయమన్నారు. రక్షణ పరిశ్రమలో యంత్ర ఇండియా లిమిటెడ్ కూడా కీలక భాగస్వామిగా ఎదుగుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2021 అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి సంస్థ ఆర్థిక, నియంత్రణ పరంగా మంచి పనితీరును కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ ఐదు ప్రాజెక్టుల్లో మూడు జీఆర్?ఎస్?ఈకి సంబంధించినవి కాగా, మరో రెండు యంత్ర ఇండియా లిమిటెడ్‌కు చెందినవి. నౌకా నిర్మాణం, యుద్ధ నౌకల మరమ్మతులు, ఆధునికీకరణ వంటి కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు జీఆర్?ఎస్?ఈ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టుతో జీఆర్?ఎస్?ఈ రెండు చిన్న షిప్‌యార్డుల కోసం లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. హూగ్లీ నదికి ఇరువైపులా ఈ షిప్‌యార్డులు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు రైచక్ ప్రాంతంలో నదీ తీరాన ఉన్న 32 ఎకరాల స్థలాన్ని కూడా జీఆర్?ఎస్?ఈ తన కార్యకలాపాల విస్తరణకు వినియోగించుకోనుంది. దీంతో యుద్ధ నౌకల నిర్మాణం, రీఫిట్ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి.

# 'డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా'

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, లోక్‌సభను అధికారికంగా ముగించడంలో (ప్రొరోగేషన్) జరుగుతున్న అసాధారణ జాప్యంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం మోదీ సర్కార్?పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

"సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా (అడ్జర్నమెంట్ సైన్ డై) పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే సభను అధికారికంగా ముగిస్తూ (ప్రొరోగేషన్) ఉత్తర్వులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వాయిదా పడిన రోజే ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. ఈ లోక్?సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడుస్తున్నా, సభ ముగింపుపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో 2015 వర్షాకాల సమావేశాల ముగింపునకు 28 రోజులు, 2021లో 20 రోజులు పట్టిన మాట వాస్తవమే. కానీ అప్పట్లో దీని వెనుక ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యూహాలు లేవు. మరి ఇప్పుడు జరుగుతున్న ఈ అసాధారణ ఆలస్యానికి కారణం ఏమిటి? ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, డీలిమిటేషన్? బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా? అందుకు కావాల్సిన 2/3 వంతు మెజారిటీ కోసం వెతుకుతున్నారా?"

**మహిళా రిజర్వేషన్‌తో ముడి!**



మహిళా రిజర్వేషన్‌తో ముడిపడి ఉన్న ఈ డీలిమిటేషన్? రాజ్యాంగ సవరణ బిల్లు, అంతకు ముందు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వీగిపోయింది. వాస్తవానికి ఈ బిల్లు ద్వారా లోక్?సభ స్థానాల సంఖ్యలను 850 వరకు పెంచాలని కేంద్రం భావించింది. కానీ 2/3 మెజారిటీ లేకపోవడంతో ఆ బిల్లుకు ఆమోదం లభించలేదు. అందుకే ఆ బిల్లును ఈసారి లోక్?సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును పార్లమెంట్? ముందుకు మళ్లీ ఎప్పుడు తీసుకువస్తామనే దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితిని ఖరారు చేయలేదని పేర్కొన్నారు. "మేము ఈ డీలిమిటేషన్ బిల్లును తీసుకువస్తామని ఎప్పుడు చెప్పాం? అయితే మీడియాలో కొన్ని ఊహాగానాలు వచ్చిన మాట వాస్తవం. దీనిని ఎప్పుడు తీసుకురావాలనేది మా అధినాయకత్వం పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ డీలిమిటేషన్? బిల్లును మహిళా రిజర్వేషన్లతో ముడిపెడుతున్నాయి. లోక్?సభలో ప్రస్తుతం ఉన్న స్థానాల పరిమితిలోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు తృణమూల్? కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) లాంటి పార్టీల నుంచి ఎంపీలను, బీజేపీ తన అక్కున చేర్చుకుని డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి.

**మోదీ సర్కార్ ప్లాన్ ఇదేనా?**

కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది. గతంలో కూడా ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నాలు చేసినప్పటికీ అప్పట్లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో ముందుకు సాగలేదు. కానీ ఈసారి ఎలాగైనా 2/3 మెజారిటీతో ఆ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20తో మొదలై, ఆగస్టు 13 వరకు కొనసాగాయి. ఆగస్టు 13 తర్వాత నిరవధికంగా వాయిదా (అడ్జర్నమెంట్ సైన్? డై) వాయిదా పడ్డాయి కానీ, అధికారికంగా ప్రొరోగేషన్ ముగియలేదు. దీనిపైనే కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది.

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ, కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామని, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తామని, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ

ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్లు సీజేపీ తెలిపింది. తమ ప్రకారం, సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందని, కేసులను కొట్టివేసేందుకు




రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని తెలిపింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది.

**'యువతను మోసం చేస్తున్నారా?'**

సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్లు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది.

**నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం**

సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్? యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెబుతోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది. ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు సుప్రీకంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు.లో క్సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రొరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి. పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, 'ప్రొరోగ్' కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రొరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ జరుగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాకాల సమావేశాల విషయంలో మాత్రం పది రోజులు గడిచినా ఆ ఉత్తర్వులు జారీ కాలేదు.

**కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమా?**

ఈ ఆలస్యానికి కారణం ఏంటన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోయినా, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్ట సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడానికి అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్రం ముందుకు తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అంశం కీలకంగా మారింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే దీనిపై చర్చ జరిగినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమకూరకపోవడంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయిందనే ప్రచారం జరిగింది.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం ఒక ప్రత్యామ్నాయ ఫార్ములాపై కసరత్తు చేస్తోందనే చర్చ సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను సమాన ప్రాతిపదికన సుమారు 50 శాతం పెంచే ప్రతిపాదనపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. అలా చేస్తే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారా?**

స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తెచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు గతంలోనే వినిపించాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యం కావడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రత్యేక సమావేశం నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమీకరించి కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**కాంగ్రెస్ ప్రశ్నల వర్షం**

సెషన్ ప్రొరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ప్రొరోగ్? ఉత్తర్వులు ఎందుకు జారీ చేయలేదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశే ప్రశ్నించారు. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేశారు. పది రోజులు గడిచినా ఇంకా ప్రొరోగేషన్‌పై సమాచారం లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైన మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. అయితే గతంలోనూ ప్రొరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయని జైరాం రమేశ్ స్వయంగా పేర్కొన్నారు. 2015లో వర్షాకాల సమావేశాల అనంతరం 28 రోజులు, 2021లో 20 రోజుల వ్యవధి ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే అప్పట్లో ప్రస్తుతం కనిపిస్తున్నట్లుగా ఎలాంటి రాజకీయ వ్యూహాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు.

**విజయ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**

డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఆగస్టు 21న మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కారణంగా ఏ రాష్ట్రానికీ పార్లమెంట్‌లో ప్రాతినిధ్య శాతం తగ్గకుండా కేంద్రం స్పష్టమైన చట్టపరమైన హామీ ఇవ్వాలని విజయ్ కోరారు. మరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వచ్చే 25 ఏళ్ల పాటు సీట్ల సంఖ్యను మార్చకూడదని కేంద్రాన్ని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్‌పై కేంద్రం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ఏదైనా కొత్త ఫార్ములాను ముందుకు తెస్తుందా? ప్రత్యేక సమావేశానికి తెరలేపుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## చేదెక్కిన చక్కెర

**ముంబై :** దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది.అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి .ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి.

# కేసు నుంచి తప్పించండి 'ఎంతైనా ఇస్తాం'!




-మొదటిపేజీ తరువాయి

బయటికి పొక్కనివ్వకుండా గోప్యంగా ఉంచారు. ఇందులో భాగంగానే నిందితుడు సంజూష్ స్థానంలో మరొక ప్రైవేట్ డ్రైవర్‌ను పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే అప్పటికే ఘటనాస్థలిలో స్థానికులు ఫోన్‌లో రికార్డ్ చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఈనెల 21న మీడియాకు లీకులు ఇచ్చారు. అందుకే అతివేగం, నిర్లక్ష్యంగా కారు నడిపి రోడ్డు దాటుతున్న పాదచారి భారతీ మృతికి కారణమైన తీవ్రమైన రోడ్డు ప్రమాదంలో కూడా పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. నిందితుడు సంజూష్‌ను వెంటనే అరెస్ట్ చేయకుండా, నోటీసులతో సరిపెట్టేశారు. స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేశారు. కేవలం బీఎన్ఎస్ 106(1) కింద అనుకూల సెక్షన్ నమోదు చేశారు. కారుతో ఢీకొట్టి మరణానికి కారణమైన కేసులో మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**పోలీసు బాస్ సీరియస్**

ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఉన్న లింగమనేని రమేష్ కుమారుడు కావడంతోనే సంజూష్‌పై అనుకూల సెక్షన్లు నమోదు చేశారంటూ పోలీసులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారాన్ని రాష్ట్ర పోలీసు బాస్ సీరియస్‌గా తీసుకున్నారు. శనివారం మాదాపూర్ పీఎస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ), దర్యాప్తు అధికారి ఎస్ఐను కార్యాలయానికి పిలిపించుకొని కేసు నమోదు, దర్యాప్తు తీరు తదితరాలపై సమగ్ర వివరాలను సేకరించినట్లు తెలిసింది. కారు వేగం, తీవ్రమైన గాయాలతో భారతీ మృతి చెందిన తీరు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఎలాంటి సెక్షన్లు జోడించాలో తెలియదా? లేదా ఎవరి ఒత్తిడి, ప్రలోభాల వల్ల అనుకూల సెక్షన్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**రెట్టింపు వేగంతో ఢీ కొట్టి..**

ఇప్పటికే జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ఘటనాస్థలిని సందర్శించారు. నిందితుడు లింగమనేని సంజూష్ నడిపిన ఆస్టన్ మార్టిన్ లగ్జరీ స్పోర్ట్స్ కారు (టీజీ09 జీ0666)ను స్వాధీనం చేసుకొని వాహన తనిఖీని పూర్తి చేశారు. రోడ్డు దాటుతున్న భారతీని కారు ఎడమ వైపు బలంగా తాకడంతో ఆమెకు తల, శరీర భాగాలకు తీవ్రమైన గాయాలయ్యాయని, అలాగే కారు ఎడమ వైపు బాగా డ్యామేజ్ అయినట్లు గుర్తించారు. భారతీని ఢీకొట్టిన తర్వాత కారును పక్కన నిలిపి, ఆపేయడంతో కారు వేగం స్పీడోమీటర్‌లో నమోదు కాలేదు. అలాగే ఘటనాస్థలం వద్ద ఎలాంటి సీసీటీవీ కెమెరాలు గానీ స్పీడో మీటర్లు గానీ లేకపోవడంతో కారు వేగాన్ని అధికారులు అంచనా వేయలేకపోయారు. అయితే మృతిరాలి తలకు, శరీర భాగాలకు తగిలిన గాయాలను బట్టి కారు 80 కిలోమీటర్ల వేగంతో ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇనార్బిట్ మాల్ వంటి రద్దీగా ఉండే నగర రోడ్లపై కార్ల సగటు నిర్దేశిత వేగం 40 కి.మీ.గా ఉండాలి. కానీ, సంజూష్ హైఎండ్ స్పోర్ట్స్ కారుతో మిట్ట మధ్యాహ్నం, బిజీ రోడ్డులో రెట్టింపు వేగంతో కారు నడపడం తీవ్రమైన నేరం కిందకి వస్తుంది. కారు చెట్టు, డివైడర్ వంటి బలమైన వాటికి ఢీకొడితే కారులోని బెలూన్స్ తెరుచుకునే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

**కొత్త సెక్షన్ల జోడింపు**

కారు నడిపిన లింగమనేని సంజూష్ ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ సమర్పించాలని పోలీసులను డీటీఓ కోరారు. సోమవారం చేతిరాతతో రాసిన సమగ్ర నివేదిక కాపీని దర్యాప్తు అధికారికి అప్పగిస్తామని సంబంధిత అధికారి 'సాక్షి'కి తెలిపారు. అనంతరం మోటారు వాహన తనిఖీ (ఎంవీఐ) నివేదిక పరిశీలన తర్వాత సంజూష్‌పై కొత్త సెక్షన్లు జోడించే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి చెప్పారు. ఘటన తీవ్రత దృష్ట్యా బీఎన్ఎస్‌తోపాటు మోటారు వాహన చట్టం కింద కూడా కేసు నమోదు చేసే అవకాశం ఉందని చెప్పారు.

**సులువుగా బెయిల్ వచ్చేలా కేసు**

నిందితుడు సంజూష్‌పై మాదాపూర్ పోలీసులు కేవలం బీఎన్ఎస్ 106 (1) సెక్షన్ కింద మాత్రమే కేసు నమోదు చేశారు. అంటే అజాగ్రత్త లేదా నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగిన సాధారణ ప్రమాదంగా దీన్ని పరిగణిస్తారు. ఇది పూర్తిగా బెయిలబుల్ నేరం. దీని కింద గరిష్ఠంగా ఐదేళ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్నప్పటికీ.. నిందితుడికి పోలీస్ స్టేషన్ నుంచి లేదా కోర్టుకు వెళ్లిన వెంటనే సులువుగా బెయిల్ లభిస్తుంది. అయితే హైస్పీడ్ కారును బిజీ పబ్లిక్ ఏరియాలో నడుపుతున్నప్పుడు దాని వల్ల ఎదుటివారి ప్రాణాలు పోతాయని తెలిసి కూడా నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్టు ఆధారాలు ఉంటే బీఎన్ఎస్ 105 సెక్షన్‌ను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలి. ఈ సెక్షన్ కింద (మరణం సంభవించే అవకాశం ఉందని తెలిసి చేసిన చర్య అయితే..) పదేళ్ల వరకు జైలు, జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. మోటార్ వాహన చట్టం 184 సెక్షన్ చేర్చడం కూడా కీలకమే. ఈ సెక్షన్ ప్రకారం ప్రజలకు ప్రమాదకరంగా ఉండే వేగంతో లేదా డేంజరస్ డ్రైవింగ్‌గా పరిగణిస్తారు. కానీ ఈ సెక్షన్‌ను ఎఫ్ఐఆర్‌లో నమోదుచేయలేదు.

# 12వ వేతన ఒప్పందమేది?..
# కార్మిక కుటుంబాల్లో ఆందోళన



**పెద్దపల్లి, :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్మికులకు కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం 12వ వేతన ఒప్పందంపై తీవ్ర జాప్యం చేస్తున్నాయి. 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాల్సిన వేతన ఒప్పందంపై ఇంతవరకు చర్చలే ప్రారంభిం చకపోవడంపై కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. గడువు ముగిసినప్పటికీ జాయింట్ బై పార్టీ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీస్ (జేబీసీసీఐ) వేతన స్థిరీకరణ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్రంలోని 45 వేల మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొన్నది. కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తేనే వేతన చర్చలు అంటూ కోల్ ఇండియా యాజమాన్యం కాలయాపన చేస్తున్నది. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను సింగరేణిలోని టీబీజీకేఎస్, ఏఐటీయూ, ఐఎన్‌టీయూసీలు వ్యతిరేకిస్తున్నాయి. 1967 నుంచి ప్రతి ఐదేండ్లకోసారి సకాలంలో వేతన ఒప్పందం జరిగేది. లేబర్ కోడ్‌లతో సంబంధం లేకుండానే కేంద్రం కార్మిక సంఘాల ప్రతినిధులతో జేబీసీసీఐని ఏర్పాటు చేయాలని, లేకపోతే వచ్చే నెల 12న ఢిల్లీలో జాతీయస్థాయి కార్మిక సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటించాలని ప్రధాన సంఘాలు నిర్ణయించాయి. దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికులకు అమలు చేయాల్సిన వేతనాలు, అలవెన్స్‌ను ఖరారు చేసేందుకు కేంద్రం, కోల్ ఇండియా కార్మికసంఘాలతో 1967 నుంచి జేబీసీసీఐ ఏర్పాటు చేసింది. 1వ వేజ్ బోర్డు 1 జనవరి 1975 నుంచి 31 డిసెంబర్ 1978 కాలాన్ని నిర్ణయించారు. 12వ వేజ్ బోర్డు 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాలి. జేబీసీసీఐ ఏర్పాటు చేసి, 12వ వేతన చర్చలు ప్రారంభించాలని, లేకుంటే సింగరేణి నుంచి జాతీయ స్థాయి వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## రాయబారులుగా నిలవాలి

-మొదటిపేజీ తరువాయి

ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్?లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా : అంతేకాకుండా, ఈ విషయంలో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తనకు, తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భాగ్యనగరానికి చేరుకున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దానికి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాలకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి సమాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

"విదేశీ పర్యటన అంశంలో నాకు మద్దతుగా నిలిచిన ఖర్గేకు కృతజ్ఞతలు

లండన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నాను. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నాను. రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. మరికొన్ని గంటల్లో హైదరాబాద్ వస్తున్నా. హైదరాబాద్‌కు వచ్చాక మిగిలిన అంశాలపై మాట్లాడతాను"– సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

**లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం సమావేశం**

ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ప్రవాసులతో వారు చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.

## మంత్రి పొన్నంతో చర్చలు సఫలం

-మొదటిపేజీ తరువాయి

తలపెట్టదలచిన సమ్మెను విరమిస్తున్నట్లు ఆటో కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఆటో కార్మికుల సంఘాల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయనుందన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని అవి కేవలం తప్పుడు ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. కార్మిక, రవాణా, ఆటో కార్మికుల సంఘాల ప్రతినిధులతో సెప్టెంబర్ 1న సమావేశం నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అలాగే ఆటో ఛార్జీల పెంపునకు వీలుగా ఉత్తర్వును జారీ చేయడానికి కూడా ప్రభుత్వం అంగీకరించిందని ఓలా, ఊబర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు.

**ఆటో సంఘాల డిమాండ్లు ఇవే :**

ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలి. ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్?లకు బదులుగా ప్రభుత్వమే ఒక కొత్త యాప్?ను తీసుకురావాలి. ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూవీలర్లను నిషేదించాలి. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలి. ఆటో డ్రైవర్లకు ఈ–ఛలాన్ల నుంచి మినహాయింపు ఇవ్వాలి హైదరాబాద్ నగరంలో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలి వాహన సారథి పోర్టల్?లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలి రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్స్ జి.ఓ.ఎం.ఎస్ నం.60లో ఆటోలకు మినహాయించాలి

## అధిష్టానం వద్దకు 'కొండా' పంచాయితీ

-మొదటిపేజీ తరువాయి

పరిణామాలపై మాట్లాడినట్టు తెలిసింది. ఇటీవల పరకాలలో జరిగిన సభలో సీఎం ఏం మాట్లాడారు? ఆ తర్వాత తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలు, తనకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసులు, తానిచ్చిన సమాధానం, తనకు వ్యతిరేకంగా కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా పెట్టిన ప్రెస్‌మీట్, తనను వ్యక్తిగతంగా కించపరుస్తూ వారు మాట్లాడిన మాటలు, ఆ తర్వాత తాను రెండోసారి క్రమశిక్షణ కమిటీకి రాసిన లేఖ, గతంలో వరంగల్ జిల్లాలో జరిగిన గొడవలు, ఆ సందర్భంలో పార్టీ, సీఎం వ్యవహరించిన తీరు గురించి ఖర్గేకు ఆమె వివరించినట్టు తెలిసింది. అయితే సురేఖ చెప్పిన వివరణ విన్న ఖర్గే ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. సుస్మిత వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేసేవిధంగా ఉన్నాయి కదా అని ప్రశ్నించిన ఖర్గే.. సీఎం గురించి అలా మాట్లాడి ఉండాల్సింది కాదని అభిప్రాయపడినట్టు సమాచారం. అన్ని విషయాలు పార్టీ పరిశీలిస్తుందని, సీఎం వచ్చాక మాట్లాడుదామని, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్‌లతో క్షుణ్ణంగా చర్చించాక ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని ఖర్గే చెప్పినట్టు సమాచారం.

**బీజేపీ చీఫ్ రాంచందర్‌రావుకు తారసపడిన సురేఖ**

మంత్రి కొండా సురేఖ బెంగళూరు నుంచి తిరుగు ప్రయాణంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువురూ పలకరించుకున్నారని, ఆ సమయంలోనే బెంగళూరు నుంచి వస్తున్నానని సురేఖ వెల్లడించారని సమాచారం.

# కాంగ్రెస్‌లో కష్టమే.. వేరే పార్టీలు చేర్చుకోవు!

**వరంగల్ :** వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదటినుంచీ దూకుడు వైఖరి ప్రదర్శించే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపైనే నేరుగా బహిరంగ తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ముసలానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చిన వెంటనే.. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్‌పై తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లిదండ్రుల ప్రత్యక్ష ఆశీస్సులు, సంపూర్ణ రాజకీయ మద్దతు లేకుండా కేవలం ఒక కుమార్తెగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని, ఇది పూర్తిగా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయమే. ఈ దూకుడు వెనుక ఉన్న ప్రధాన కారణం పరకాల నియోజకవర్గంలో తమ పట్టును, వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయమే. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపిస్తూనే, తమ కుమార్తె సుస్మితను పరకాల నుంచి బరిలోకి దించాలన్న పట్టుదలతో కొండా కుటుంబం ఉంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో కొండా వర్గంలో అభద్రతాభావం తారాస్థాయికి చేరింది. అధిష్ఠానాన్ని, సీఎంను తీవ్రస్థాయిలో బెదిరించి, ఒత్తిడి తీసుకురావడం ద్వారానే తమ రాజకీయ డిమాండ్లను సాధించుకోవచ్చనే పాత పంథానే వారు మళ్లీ నమ్ముకున్నట్లు కనిపిస్తోంది.

అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్‌కు చేటు తెచ్చే ప్రమాదం ఉంది. గతంలో వైఎస్సార్ మరణానంతరం వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అనుభవించి అక్కడా కేసీఆర్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌కు రావడం వంటి వరుస పార్టీ మార్పిడుల చరిత్ర వారికి ఉంది. క్రమశిక్షణారాహిత్యంతో సొంత ప్రభుత్వాలపైనే రచ్చకెక్కే నైజం ఉన్న నేతలను చేర్చుకోవడానికి విపక్ష బీఆర్ఎస్ లేదా బీజేపీ వంటి ఇతర పార్టీలు కూడా సుముఖంగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే లేదా కేబినెట్ నుంచి తప్పిస్తే.. రాజకీయంగా ఒంటరిపాటు కావడం ఖాయమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొండా కుటుంబం తీసుకుంటున్నది అత్యంత ప్రమాదకరమైన జూదమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఉంటూనే సీఎం స్థాయి వ్యక్తిపై బరితెగించి ఆరోపణలు చేయడం వల్ల తాత్కాలికంగా మీడియా మైలేజ్ లభించినప్పటికీ, దీర్ఘకాలికంగా అది వారి రాజకీయ పునాదులకే గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉంది.

**కొండా సురేఖ భవిష్యత్తు తేల్చేది ఆ లేఖేనా**

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో మంత్రి కొండా సురేఖ స్వయంగా కల్పించుకుని, కూతురి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సీఎంకు క్షమాపణలు చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అయితే, ఒకసారి పొరపాటు జరిగిందని సరిదిద్దుకున్న తర్వాత కూడా మళ్లీ అదే తరహాలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు చేయడం వెనుక గల ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కేవలం ఒక క్షమాపణ లేఖతో ఈ వివాదం సద్దుమణుగుతుందా? లేక అధిష్ఠానం కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. క్రమశిక్షణ కమిటీకి సమర్పించే లేఖలో కొండా సురేఖ ఏ వైఖరి తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ముందు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకటి కూతురి వ్యాఖ్యలకు మద్దతు తెలపడం. కూతురు లేవనెత్తిన అంశాలను సమర్థిస్తే అది నేరుగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినట్లే అవుతుంది. ఇది మంత్రి పదవికి ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. రెండోది కూతురి వ్యాఖ్యలను ఖండించి క్షమాపణ కోరడం. కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పడం. తద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి తప్పించుకోవడం. మూడోది పరకాల రాజకీయాన్ని తెరపైకి తేవడం. కూతురి వ్యాఖ్యలపై పెద్దగా స్పందించకుండా, స్థానిక రాజకీయం, పరకాల నియోజకవర్గంలో తమ వర్గానికి జరుగుతున్న అన్యాయం, గ్రూపు రాజకీయాల వల్లే అసహనంతో ఈ వ్యాఖ్యలు వచ్చాయనే విషయాన్ని లేఖలో ప్రస్తావించడం. కొండా కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, బలమైన క్యాడర్ ఉన్నాయి. అయితే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో నేరుగా తలపడటం కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణ అసంతృప్తికరంగా ఉంటే అధిష్ఠానం ఎలాంటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ పంపే లేఖ ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా, లేక కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సంక్షోభానికి నాంది పలుకుతుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది.

## సంపాదకీయం

# బ్రెజిల్‌పై అమెరికా పడగ!

లాటిన్ అమెరికా దేశాల్లో నియంతలను గద్దెనెక్కించిన గతకాలపు పోకడలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. వచ్చే అక్టోబర్ మొదటివారం బ్రెజిల్‌లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత దేశాధ్యక్షుడు, మధ్యేవాద వామపక్ష నేత లూలా డి సిల్వాను ఓడించి మితవాద పక్ష నాయకుడు ఫ్లేవియో బోల్సోనారో అధికారంలోకి రాలేనట్టయితే సైనిక జోక్యం చేసుకోవటానికి పథక రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు నేరస్త ముఠాలు సీవీ, పీసీసీలను ఉగ్రవాద సంస్థలుగా అమెరికా ప్రకటించింది. వీరినుంచి అమెరికాకు ఏర్పడిన ముప్పును తొలగించటంలో బ్రెజిల్ విఫలమైందన్న సాకుతో సైనిక దాడి చేయటమే ఈ పథకం ఆంతర్యం. వెనిజులాలో సైతం నిరుడు ట్రంప్ ఇదే తరహా డ్రామా నడిపించారు. మాదకద్రవ్య ముఠాలు అమెరికా భద్రతకు ముప్పుగా మారాయనీ, వాటిని అధ్యక్షుడు మదురో ప్రోత్సహిస్తున్నారనీ ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో మదురో దంపతుల్ని కిడ్నాప్ చేసి అమెరికాకు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ అమెరికా కోర్టులో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. లాటిన్ అమెరికా దేశాలన్నిటా 1964 మొదలుకొని రెండు దశాబ్దాలపాటు అమెరికా ఇలాంటి దుర్మార్గాలకే పాల్పడింది. ఇదే బ్రెజిల్‌లో 1964లో వామపక్ష ప్రభుత్వాధినేత జివావో గౌలార్ట్‌ను సైనిక కుట్రలో తొలగించి హుంబెర్టో కాస్టిలోను గద్దెనెక్కించింది. అదే సంవత్సరం బొలీవియాపై సైతం ఇదే కుట్ర కొనసాగించింది. చిలీలో 1973లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సోషలిస్టు నాయకుడు సాల్వెడార్ అలెండీని సైనిక తిరుగుబాటులో హతమార్చి అగస్టో పినోచెట్‌ను అధినేతగా కూర్చోబెట్టింది. ఇలా ఉరుగ్వే, అర్జెంటీనా, ఎల్ సాల్వెడార్, గ్వాటెమాలా దేశాల్లో సైతం 1985 వరకూ ఈ కుట్రలు సాగుతూనే వచ్చాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తన పొరుగున ఆనాటి సోవియట్ ప్రభావం పడితే తన ప్రాభవం కొడిగడుతుందన్న భయాందోళనలే ఈ కుట్రలకు కారణం. నియంతల రాకతో లాటిన్ అమెరికా దేశాల ప్రజానీకం భయానక పాలన చవిచూశారు. ఒక్క అర్జెంటీనాలోనే 'డర్టీ వార్' పేరుతో పదివేలమంది ప్రాణాలు తీశారు. చిలీలో, ఎల్‌సాల్వెడార్‌లో, గ్వాటెమాలాలో సాగించిన నరమేధాలు దాదాపు యాభైవేలమంది ఉసురుతీశాయి. మళ్లీ ఇన్నాళ్లకు అమెరికా అస్తిత్వ ఆందోళనలో పడింది. మొన్న మే నెలలో జరిగిన కొలంబియా ఎన్నికల్లో ట్రంప్ తెరవెనక సాగించిన కుట్రల ఫలితంగా ఆయన అనుకూలుడు ఎబెలార్డో ఎస్పియెల్లా స్వల్ప ఆధిక్యతతో అధికారంలోకొచ్చారు. అందుకే బ్రెజిల్‌లో సైతం ఆ పాచిక పారుతుందనుకుంటున్నారు. లూలా బ్రిక్స్ కూటమిలో చురుగ్గా పాలుపంచుకోవటం, చైనాతో సాన్నిహిత్యం పెంచుకోవటం, అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవటం ట్రంప్‌కు కంటగింపుగా మారాయి. తన కీలుబొమ్మ జైర్ బోల్సొనారో 2023 ఎన్నికల్లో పదవీభ్రష్టుడు కావటంనుంచే ట్రంప్ బుసలుకొడుతున్నారు. తిరుగుబాటు కుట్రలో బోల్సొనారోను శిక్షిస్తే తీవ్ర పరిణామాలుంటాయని న్యాయవ్యవస్థను సైతం హెచ్చరించారు. కానీ ఈ ఏడాది మొదట్లో బోల్సొనారోకు 27 యేళ్ల ఖైదు పడింది. ప్రస్తుతం డి సిల్వాతో తలపడేందుకు రంగంలో 13 మంది అభ్యర్థులున్నారు. ఆయనకు 40 శాతం మద్దతుంటే, సమీప ప్రత్యర్థి ఫ్లేవియో 28 శాతంవద్ద ఆగిపోయారు. దీన్నెలాగైనా తారుమారు చేయటానికి అమెరికా పడరాని పాట్లు పడుతోంది. బ్రెజిల్ పాత్రికేయులకూ, వివిధ మాధ్యమాల్లో ప్రభావం చూపగల వారికీ ఉదారంగా వీసాలు మంజూరుచేసి 'భావప్రకటనా స్వేచ్ఛ'పై పాఠాలు చెబుతోంది. తప్పుడు ప్రచారాలు సాగిస్తోంది. అయినా పరిస్థితి ఆశాజనకంగా లేకపోవటంతో కొత్త ఎత్తుకు తెరలేపింది. ఇరాన్‌లో ఓటమి ఎదురుకావటం, ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినటం, డాలర్ మనుగడకు ముప్పు ఏర్పడటం ట్రంప్‌ను వేధిస్తున్నాయి. ఇప్పటికే పెరూ, ఎల్‌సాల్వెడార్ దేశాల్లో మితవాదులు గెలిచారు. బ్రెజిల్‌ను సైతం లోబరుచుకోగలిగితే దేశంలో తన కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయని ట్రంప్ భావిస్తున్నారు. పొరుగు దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంలాంటి అనాగరిక పోకడలకు అమెరికా ఇకనైనా స్వస్తిచెప్పాలి.

# ఆనాటి భారత్-చైనా జ్ఞానమైత్రి ఇప్పుడూ కావాలి!




స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తి అవుతున్న తరుణంలో 'కాక్రోచ్' పేరుతో వార్తల్లో క్రియాశీలంగా మారిన ఒత్తిడి గుంపులను మన మేధావులు కొందరు కేంద్ర ప్రభుత్వ వైఫల్య కోణం నుంచి చూస్తున్నారు. మరికొందరు అందులో మోదీ సర్కారు తప్పేమీ లేదు, చైనాలోని మన మేలుకోరని మేధావులతో కలిసి ఇక్కడి కొందరు చేస్తున్న కుట్రగా దీన్ని విమర్శిస్తున్నారు. ఇక ఆందోళనలు చేసిన వారిని 'కాక్రోచ్'లు అంటుంటే, చైనాలోని మేధావులను 'ఎలుకలు' అంటున్నారు. సమకాలీన పరిణామాలపై ఈ వ్యాఖ్యలు ఎలా ఉన్నా భారత్--చైనాల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు ఈనాటివి కావు.

క్రీ.శ. ఐదవ శతాబ్దిలో మొదలైన జ్ఞానశోధన భారత--చైనాల మైత్రికి పునాదులు వేసింది. ఆధునిక భారత చరిత్రలో నెహ్రూ యుగంగా పరిగణించే కాలంలో ఆ శోధన ఒక స్ఫూర్తి అయింది. ఆనాడు భారత్ నుంచి చైనాకు పెద్ద ఎత్తున పండిత వర్గం వెళ్లి అక్కడ ఏళ్ల తరబడి నివాసం ఉండి వారికి సంస్కృతాన్ని బోధిస్తూ చీనీ భాషలోకి సంస్కృత గ్రంథాలను వారు తర్జుమా చేశారు. వారిలో ప్రముఖుడు కాశ్యప మాతంగ. కీ.శ. 67లో మింగ్ చి చక్రవర్తి ఆహ్వానంపై చైనా వెళ్ళిన కాశ్యప 'లో' నదీ తీరంలోని లోయాంగ్ పట్టణంలో నివాసం ఉన్నాడు. భారత్ నుంచి ఇలా చైనా వెళ్ళిన ప్రముఖుల్లో-- బుద్ధభద్ర, జీనభద్ర, ధర్మరక్ష, కుమారజీవ, పారమార్థ, జీనగుప్త, బోధిధర్మ మొదలైన వారు ఉన్నారు.

వీరిలో ప్రతి ఒక్కరూ తమ శిష్యులతో, బౌద్ధ బిక్షువుల బృందాలతో కలిసి చైనాకు తరలివెళ్లారు. ఒక దశలో (కీ.శ. 6వ శతాబ్దికి) ఒక్క లియాంగ్ పరగణాలోనే మూడు వేల మంది భారతీయ బౌద్ధ భిక్షువులు, పది వేల భారతీయ కుటుంబాలు ఉండేవి. వీరు తమతో ఎన్నో సంస్కృత గ్రంథాలను అక్కడికి తీసుకుని వెళ్లి, వాటిని చీనీ భాషలోకి తర్జుమా చేశారు. వీరిలో కొందరు నేరుగా చీనీలో గ్రంథాలనూ రాశారు. కుమారజీవ చీనీ భాషలో 47 గ్రంథాలను రాసిన సుప్రసిద్ధ రచయిత. ఇక జీవగుప్త 37 సంస్కృత గ్రంథాలను చీనీ భాషలోకి అనువదించారు. వీరి రాకపోకలకు ఈ సారస్వత ఆదాన ప్రదానాలకు కీ.శ. 427లో ప్రారంభమైన మన నలంద విశ్వవిద్యాలయమే సమన్వయ కేంద్రంగా ఉండేది. ఇలా భారత్ నుంచి చైనా వెళ్ళిన పండితుల వద్ద అక్కడ శిష్యులుగా చేరిన చైనా ప్రముఖులు ఎందరో ఉన్నారు. ప్రముఖ యాత్రా చరిత్రకారుడుగా మన చరిత్ర గ్రంథాల్లో ప్రస్తావించే ఫాహియాన్ (కీ.శ. 337--422) కుమారజీవకు శిష్యుడు. భారత్‌లో పర్యటనకు బయలుదేరే ముందు గురువు కుమారజీవను ఫాహియాన్ సంప్రదిస్తాడు. అప్పుడు కుమారజీవ ఇలా సలహా ఇస్తాడు: "భారత్‌లో నీ సమయమంతా మత సంబంధమైన జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికే వెచ్చించవద్దు. అక్కడి ప్రజలు, వారి జీవన విధానం కూడా క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యి; అప్పుడు చైనాకు ఆ దేశ ప్రజలను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది".

చాలా ఆసక్తికరమైన అంశం ఇది. ఆసియాలోని ఇరుగు పొరుగు దేశాల మధ్య భవిష్యత్తులో ఏర్పడాల్సిన సత్సంబంధాల అవసరాన్ని నాటి పండితులు గుర్తించడం ఇందులో మనకు కనిపిస్తుంది. కుమారజీవ దూరదృష్టి ఫలితాలు హుయన్ త్సాంగ్ (602--664) కాలంలో కనిపిస్తాయి. రెండు దేశాల పాలకుల దృష్టిలో హుయన్ త్సాంగ్ ఒక గౌరవనీయుడైన ఇరుదేశాల ప్రతినిధిగా గుర్తింపు పొందాడు. భారత్ నుంచి ఆయన తనతో చైనా తీసుకువెళ్ళిన 645 సంస్కృత గ్రంథాలను, అక్కడి చక్రవర్తుల సహకారంతో ఒక పండిత బృందాన్ని ఏర్పాటు చేసి వాటిని చీనీలోకి తర్జుమా చేయించాడు.

హుయన్ త్సాంగ్ భారత్ నుంచి చైనా తిరిగి వెళ్ళిన తర్వాత, రెండు దేశాల మధ్య అప్పటి వరకు ఒకరి పట్ల మరొకరికి ఉన్న అభిప్రాయాలకు 'కొత్త చూపు' వచ్చి చేరింది. భారత్‌లో కనూజ్ రాజధానిగా పరిపాలిస్తున్న హర్షవర్ధనుడు -- చైనా టి యాంగ్ చక్రవర్తి ఇరువురూ స్నేహపూర్వకంగా రాయబారులను పంపుకున్నారు. ఆసియాలోని ఈ రెండు పెద్ద దేశాల మధ్య సారూప్యత గల అంశాలు స్పష్టమైన రూపుతీసుకున్నాక, వాటి ప్రభావం సమాంతరంగా తూర్పు ఆసియాలో ఉన్న చిన్న దేశాల్లో కనపడింది.

ఈ దేశాలు తొలుత బ్రాహ్మణిజం ఆధిపత్యంలో ఉండి, తర్వాత క్రమంగా బౌద్ధంలోకి మారాయి. తొలుత ఈ రెండు మతాలూ ఒక దశ వరకు సామరస్యపూర్వకంగా ఉండేవి. తర్వాత వీటి మధ్య స్పర్థ మొదలయింది. అయితే ఆ స్పర్థ క్రమంగా పోరుగా మారడానికి మాత్రం కారణం ఆధ్యాత్మిక వైరం కాదు. అందుకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య కారణాలు ఉన్నాయి అంటారు నెహ్రూ. కాలక్రమంలో సముద్ర వాణిజ్య మార్గాల పైన గుత్తాధిపత్యం ఈ దేశాల మనుగడకు కీలకం అయింది. ఐదవ శతాబ్ది నాటికి ఈ దేశాల్లో మహా నగరాలు ఏర్పడ్డాయి.

తొలుత జ్ఞాన తృష్ణను తీర్చుకోవడానికి మొదలైన ప్రస్థానం మనిషిని కొత్త తీరాలకు తీసుకువెళితే, కొత్త జాతులతో మొదలై విస్తరించిన స్నేహపూర్వక సంబంధాలు క్రమక్రమంగా వాణిజ్య కేంద్రంగా మారాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం, పలు మొదటి ప్రపంచ దేశాలను తాకిన స్థాయిలో మనల్ని తాకలేకపోయింది. ఆర్థిక సంస్కరణల అమలులో మన కంటే ముందు ఉన్న ఆసియా దిగ్గజం చైనా అప్పటికే ప్రపంచ మాంద్యం ప్రకంపనాలు తనని తాకకుండా నిలువరించగలిగింది. అది మొదలు క్రమక్రమంగా ప్రపంచ దేశాల దృష్టి యూరప్ నుంచి ఆసియా మీదికి మళ్ళింది.

18వ శతాబ్ది వరకు ప్రపంచ జీడీపీలో సగభాగం ఆసియాది అంటే అందుకు ఆశ్చర్యం అక్కరలేదు. అయితే, ఈ ఇరుదేశాల ప్రాధాన్యాల్లో ఇప్పుడు 'జ్ఞానం' మసకబారి 'విపణి' పెద్దపీట ఎక్కి కూచుంది. చైనా మళ్ళీ 'సిల్క్ రూట్' పునరుద్ధరణ అంటూ తన వాణిజ్య ఆబకు గత చరిత్ర సొబగులు అద్ది, 'వన్ బెల్ట్--వన్ రోడ్' ప్రాజెక్టుతో 'ఆఫ్రో--ఆసియా' మ్యాప్ పైకి దూసుకువచ్చింది.

స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వార్షిక నివేదిక ప్రకారం అత్యధిక సైనిక వ్యయంతో ముందున్న మొదటి మూడు దేశాల్లో చైనా, ఇండియా ఉన్నాయి. చైనా, పాకిస్థాన్‌లతో ఇండియా ఎదుర్కొంటున్న ఒత్తిడి, శత్రుత్వం, మన రక్షణ వ్యయం ఇంతగా పెరగడానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు సిప్రిలో సీనియర్ పరిశోధకుడు సైమన్ టి. వైజ్‌మెన్. పశ్చిమాసియా శాంతి ఒప్పందాల చర్చలకు పాకిస్థాన్ వంటి దేశాలను మధ్యవర్తులుగా అమెరికా ఎంచుకొంటుంటే, చైనాతో మైత్రి నుంచి దూరమై చాలా దూరం వచ్చేశాక, మనం ఇక్కడ సరిచేసుకోవలసిన వాటిని పట్టించుకోకుండా సమస్యనంతా చైనా ఎలుకల పైకి నెట్టడం విజ్ఞతేనా? మనం చేయవల్సిన వాటిని చేయకుండా ఎవరినో వేలెత్తి చూపటంతో సమస్యలు పరిష్కారం అవుతాయా?

# భూమి రిజిస్ట్రేషన్ ఆపే అధికారం అధికారులకు ఉందా?

భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన అత్యంత కీలకమైన రక్షణల్లో ఆస్తి హక్కు ఒకటి. రాజ్యాంగంలోని అధికరణ 300–ూ ప్రకారం 'చట్టబద్ధమైన అధికారం లేకుండా పౌరులను తమ ఆస్తి నుంచి దూరం చేయరాదు'. ఇక్కడ 'చట్టం' అంటే ప్రజాప్రాతినిధ్య శాసనసభలు చేసిన శాసనమే తప్ప, రెవెన్యూ అధికారుల అంతర్గత సర్క్యులర్లు, ఎగ్జిక్యూటివ్ మెమోలు లేదా రాతపూర్వక లేఖలు కావు. అయినా వాటికి దిక్కులేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ చేసిన చట్టంలో ఈ సెక్షన్ చాలా భయంకరంగా తయారైందని 2012లో హైకోర్టు తీవ్రంగా విమర్శించింది. తీర్పులో కఠినమైన ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 2012లో దాఖలైన మొత్తం 35,000 రిట్ పిటిషన్లలో 3,360 పిటిషన్లు (దాదాపు 10% కేసులు) కేవలం సబ్ రిజిస్ట్రార్లు సెక్షన్ 22–ూ పేరుతో దస్తావేజులను తిరస్కరించడానికి సంబంధించినవే. అప్పుడు ప్రభుత్వం ఒకవైపు వేలాది ఎకరాల రిజిస్ట్రేషన్లను అడ్డుకుంటూ ప్రజలను వేధిస్తూ ఉండింది. మరోవైపు లక్షలాది రూపాయల స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో రావాల్సిన ప్రభుత్వ ఖజానా ఆదాయాన్ని కోల్పోతున్నది. అంతిమంగా ప్రభుత్వానికి దక్కిన ప్రజాభూమి రక్షణ శూన్యం, ప్రజలకు మిగిలిన వేధింపులు అనంతం. ఈ విపత్కర పరిస్థితుల్లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు. కానీ రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని 'సెక్షన్ 22–ూ' అనే ఒకే ఒక్క ఉప నిబంధన ఇవాళ అవినీతి, ప్రజల నిస్సహాయత, అధికారుల నిరంకుశత్వానికి పరాకాష్టగా మారింది.

సెక్షన్ 22–ూ చదివితే దాని వెనుక ఉన్న శాసన ఉద్దేశం చాలా స్పష్టమైనదని అనుకుంటున్నాం. ప్రభుత్వ భూములు, దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్ ఆస్తులు, సీలింగ్ చట్టాల కింద ప్రభుత్వానికి మిగులు భూములు, ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో నకిలీ దస్తావేజులు పుట్టకుండా కాపాడేందుకు మాత్రమే దీనిని ఒక 'చట్టబద్ధ రక్షణ కవచం'గా ప్రవేశపెట్టారని అన్నారు. కానీ కాలక్రమేణా ఇది సామాన్య ప్రజలను దోపిడీ చేసే ఒక 'పరిపాలనా వేధింపుల అస్త్రం'గా మారిపోయింది. స్పష్టమైన యాజమాన్య హక్కులు ఉండి, 1930, 1940 నుంచీ చట్టబద్ధమైన రిజిస్టర్డ్ దస్తావేజులు కలిగి ఉండి, ప్రభుత్వానికి భూమి శిస్తు చెల్లిస్తూ, చట్టబద్ధమైన పట్టాదార్ పాసుపుస్తకాలు ఉన్న సాధారణ రైతులు, పౌరులు తమ ఆస్తిని అమ్ముకోలేని పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ఏకపక్ష 'నిషిద్ధ జాబితాల' కారణంగా లక్షలాది కుటుంబాలు నరకయాతనను అనుభవిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో వందేండ్లకు పూర్వం (1909) నాటి రీసెటిల్‌మెంట్ రిజిస్టర్లలో పట్టాదార్ పేరు కాలమ్‌లో ఖాళీగా ఉండటం లేదా కేవలం చుక్కలు పెట్టడం వల్ల, వాటిని రెవెన్యూ యంత్రాంగం ఏకపక్షంగా 'ప్రభుత్వ భూమి'గా రికార్డుల్లో నమోదు చేసింది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 'చుక్కల భూముల చట్టం' చేయాల్సి వచ్చిందంటే, పరిపాలనా వైఫల్యం ఎంతటి తీవ్ర స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. సెక్షన్ 22–ూ దుర్వినియోగం కేవలం ఒక న్యాయపరమైన వివాదం మాత్రమే కాదు, ఇది లక్షలాది కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీసిన సామాజిక, ఆర్థిక సంక్షోభం. సామాన్య మధ్యతరగతి పౌరుడికి లేదా రైతుకు తన జీవితకాలంలో సంపాదించుకున్న ఆస్తి, భూమిని అమ్ముకుందామనుకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆ దస్తావేజును స్వీకరించడానికి తిరస్కరిస్తుంది. ఆ సర్వే నంబర్‌ను నిషిద్ధ జాబితాలో చేర్చారనో లేదా అది ఏడబ్ల్యూడీ (అసెస్డ్ వేస్ట్ డ్రై) అనో స్థానిక తహసీల్దార్ కారణం చూపుతారు.

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లో ఎక్కడా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్" అనే భావనే లేదు. కానీ సబ్ రిజిస్ట్రార్లు ప్రజలను రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఎన్‌వోసీ తీసుకురావాలని ఆదేశిస్తారు. ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అటు తహసీల్దార్ /కలెక్టర్ కార్యాలయాల మధ్య పౌరులు ఏండ్ల తరబడి చెప్పులరిగేలా తిరగాల్సి వస్తున్నది. దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనికులకు ప్రభుత్వాలు భూములు కేటాయించాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 ఏండ్ల లాక్ ఇన్ పీరియడ్ ముగిసిన తర్వాత వీరు ఈ భూములను అమ్ముకోవడానికి పూర్తి చట్టబద్ధమైన హక్కు ఉన్నది. అయినప్పటికీ అధికారులు దశాబ్దాల తర్వాత కూడా వీటిని సెక్షన్ 22–ూ కింద బ్లాక్ చేసి వారి కుటుంబాలను వేధించారు. స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూములను ఎటువంటి షరతులు లేకుండా అమ్ముకోవచ్చు. వీరి వారసులను కూడా అక్రమంగా నిషేధిత జాబితాల్లో చేర్చి అధికారులు ఇబ్బందులకు గురిచేశారు.

1. ఆర్ఎస్ఆర్ కాలమ్స్‌లోని చుక్కలు: 1909 నాటి రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్లలోని ఖాళీలను ప్రభుత్వ భూమిగా పరిగణించడం. 80-90 ఏండ్లుగా రిజిస్టర్డ్ దస్తావేజులు ఉన్న భూములను కూడా ఎటువంటి న్యాయ విచారణ లేకుండా ప్రైవేట్ వ్యక్తుల నుంచి లాక్కోవడం.

2. అసెస్డ్ వేస్ట్ డ్రై (ఏడబ్ల్యూడీ): ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములను కేవలం రికార్డులో 'ఏడబ్ల్యూడీ' అని ఉన్నదని కారణం చూపి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం. నిజంగా ప్రభుత్వ భూమి అయితే సివిల్ కోర్టులో దావా వేసి భూమిని స్వాధీనం చేసుకోవాలి కానీ, రిజిస్ట్రేషన్లను అడ్డుకుని పౌరులను బ్లాక్‌మెయిల్ చేయడం దారుణం.

3. గెజిట్ నోటిఫికేషన్లను తుంగలో తొక్కడం: చట్టం ప్రకారం సెక్షన్ 22–ూ(1)(వ) కింద నిషేధం విధించాలంటే ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. కానీ అధికారులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, కేవలం తహసీల్దార్ పంపిన లెటర్ హెడ్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు.

4. న్యాయ తీర్పుల ధిక్కరణ: హైకోర్టు ఒక సర్వే నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, తదుపరి డాక్యుమెంట్‌కు అదే అభ్యంతరాన్ని మళ్లీ లేవనెత్తి పౌరులను నిరంతరం కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు.

సెక్షన్ 22–ూ శాసన పరిణామక్రమం ఈ దౌర్జన్యకరమైన చట్టం ఎలా ఉద్భవించిందో అర్థం చేసుకోవడానికి దాని శాసన న్యాయ చరిత్రను పరిశీలించాలి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి తీర్పులో అనేక ప్రధానమైన తీర్పులు ఉటంకిస్తూ, ఈ భయానకమైన కష్టాలను పేర్కొన్నారు. ప్రభుత్వం 1999లో ఆంధ్రప్రదేశ్ చట్టం 4/1999 ద్వారా రిజిస్ట్రేషన్ చట్టంలో సెక్షన్ 22–ూను చేర్చింది. అందులో 'ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైనది' అని ప్రభుత్వం భావించే ఏ డాక్యుమెంట్‌నైనా రిజిస్ట్రేషన్ చేయకుండా నోటిఫికేషన్ ద్వారా నిషేధించే విస్తృత అధికారాన్ని కార్యనిర్వాహక వర్గానికి ఇచ్చారు. స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ బసంత్ నహతా (2005) కేసులో భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) రాజస్థాన్ ప్రభుత్వం తెచ్చిన ఇటువంటి నిబంధనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. ఒక శాసనసభ తన చట్ట నిర్మాణ విధానాన్ని కార్యనిర్వాహక వర్గం ఇష్టానుసార విచక్షణకు అప్పగించరాదని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2005 డిసెంబర్‌లో 1999 నాటి సెక్షన్ 22–ూను పూర్తిగా కొట్టివేసింది. పాత చట్టం రద్దయిన తర్వాత, ప్రభుత్వం 2007లో ఆంధ్రప్రదేశ్ చట్టం 19/2007 ద్వారా సరికొత్త నిబంధనలతో సెక్షన్ 22–ూను పునర్నిర్మించింది. ఇందులో నిషేధిత ఆస్తులను ఐదు స్పష్టమైన వర్గాలుగా విభజించారు. మొదటిది 22–ూ(1)(ఋ): కేంద్ర లేదా రాష్ట్ర శాసనాల ప్రకారం స్పష్టంగా నిషేధించిన బదిలీలు (ఉదా: సీలింగ్, అసైన్డ్ ల్యాండ్స్ చట్టం). 22–ూ(1)(ఎ): కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని భూములను అనధికార వ్యక్తులు బదిలీ చేయాలనుకున్నప్పుడు. 22–ూ(1)(ఏ) : దేవాదాయ ధర్మాదాయ లేదా వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులను 10 ఏండ్లకు మించి లీజు/విక్రయం చేసినప్పుడు. 22–ూ(1)(స) : అర్బన్ ల్యాండ్ సీలింగ్ లేదా అగ్రికల్చరల్ ల్యాండ్ సీలింగ్ చట్టాల కింద మిగులు భూమిగా ప్రకటించినవి. 22–ూ(1)(వ) : కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజనాలు ముడిపడి ఉన్న ఇతర ఏవైనా ఆస్తులు

సెక్షన్ 22–ూ(2) ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ తప్పనిసరి. శాసనసభ అత్యంత జాగ్రత్తగా రూపొందించిన రక్షణ సెక్షన్ 22–ూ(1)(వ) కింద ఏదైనా భూమిని రిజిస్ట్రేషన్ కాకుండా నిరోధించాలంటే, సెక్షన్ 22–ూ(2) ప్రకారం జిల్లా కలెక్టర్ సవివరమైన కారణాలతో ప్రతిపాదన పంపాలి. దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించాలి. కానీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రార్లు ఈ గెజిట్ నోటిఫికేషన్ నిబంధనను పూర్తిగా గాలికొదిలేశారు.

## TUWJ (IJU) రాష్ట్ర అధ్యక్షులు కె. విరహత్ అలీ మాతృమూర్తి మృతికి సంతాపం తెలిపిన జర్నలిస్టు నాయకులు

మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం TUWJ,(I.J.U) రాష్ట్ర అధ్యక్షులు కె. విరహత్ అలీ గారి మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున గజ్వేల్ లోని తమ నివాసంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు పిన్నా శివ కుమార్,T.U.W.J (I.J.U)వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీరాం రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్,యూనియన్ సీనియర్ నాయకుడు నార్లగిరి యాదగిరి విరహత్ అలీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు బాషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

## ఇంద్రానగర్‌లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

--- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎండి రఫిక్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు




రామంతాపూర్, ఆగస్టు 23 ( మన మీ వార్త ):



ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రామంతపూర్ ఇంద్రానగర్‌లో మ్యాట్రిక్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రఫీక్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన ప్రజలను మహమ్మద్ రఫీక్ ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలన్నదే తన లక్ష్యమని ఆయన తెలిపారు.ప్రజలకు ఆరోగ్య సమస్యలతో పాటు మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వారి పక్షాన నిలబడి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని రఫీక్ స్పష్టం చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన మ్యాట్రిక్స్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.డి. షకీల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగపుత్ర భాస్కర్, ఆదినారాయణ గౌడ్, నార్ల అశోక్, ఎం.డి. సాదిక్, సూరి సాయి, మ్యాట్రిక్స్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో మరొకరికి జీవనదానం: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

బీరప్ప గడ్డ, ఆగస్టు 23 ( మన మీ వార్త):



రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. కళ్యాణపురి బ్రహ్మకుమారీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సల్ బ్రదర్‌హుడ్ బ్లడ్



డొనేషన్ డ్రైవ్ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై



లాంఛనంగా ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన కళ్యాణపురి బ్రహ్మకుమారీస్ శాఖ నిర్వాహకులను బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అభినందించారు. ప్రతి సంవత్సరం జ్ఞాన్‌దాన్, యోగ్‌దాన్, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి సేవ చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం ఒకరి జీవితాన్ని కాపాడే గొప్ప సేవ అని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతలో రక్తదానంపై అవగాహన, సేవాభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ దీదీ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌కు రాఖీ కట్టి, "మీకు నేను రక్షగా.. నాకు మీరు రక్షగా.. మనందరం కలిసి దేశానికి రక్షగా నిలుద్దాం" అంటూ సోదరభావంతో మెలగాలని సందేశమిచ్చారు. అనంతరం రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలకు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వికాస్, ప్రధాన కార్యదర్శి గణేష్, బ్రహ్మకుమారీస్ సభ్యులు, నిర్వాహకులు, రక్తదాతలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దిగ్విజయంగా హబ్సీగూడ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం

----మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం

---ముఖ్య అతిథిగా హాజరైన మహమ్మద్ తౌఫిక్, డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి

హబ్సీగూడ, ఆగస్టు 23 ( మన మీ వార్త) :





ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డివిజన్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్ , డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం, కంది శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరలోనే డివిజన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. డివిజన్ జనరల్ కమిటీ, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, మహిళా కాంగ్రెస్ తదితర కమిటీలకు నూతన అధ్యక్షులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఆశావాహుల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే అన్నీ చర్చించి నూతన కమిటీని ప్రకటిస్తామని తెలియజేశారు.డివిజన్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్ మాట్లాడుతూ.. పార్టీ పదవుల్లో కొత్త వారికి అవకాశం కల్పించాలని సీనియర్లు సూచించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. పార్టీ కోసం సమయం కేటాయించే వారు, పార్టీ బలోపేతం కోసం కృషి చేసేవారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వారు మాత్రమే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన తప్పుడు వ్యాఖ్యలను ముక్త కంఠంతో కండిస్తూ తీర్మానించారు. కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, హబ్సీగూడ మాజీ డివిజన్ ప్రెసిడెంట్



గన్నారం విజయ్ కుమార్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, మురళీ కృష్ణ ముదిరాజ్, కిషన్ నాయక్, రాజు నాయక్, గుండు రాజన్న, మాలు నాయక్, గంగా యాదవ్, ధర్మ రాజు, వంగూరి నర్సింగ్ రావు, లక్ష్మీ నారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు నాయక్, కలిపాక శివ, అనిల్ మామిడాల, సాయి కుమార్, సాయి కిరణ్, సుమన్ నాయక్, అఖిల్, మహమూద్, మేకల శివ, నవీన్ యాదవ్, రాఘవ, సందీప్, లోకేశ్, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

# జన సమితి కార్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 23 ( మన మీ వార్త):





తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నమైన బోనాల వేడుకలు తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నాంపల్లి టీజేఎస్ కార్యాలయంలో మహిళా జన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పుష్పనీల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు చెల్లించారు. పోతురాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా జరిగాయి. బోనాల వేడుకలకు ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం నరసయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు తెలంగాణ సంస్కృతిని అందించడమే బోనాల ప్రత్యేకత అని కొనియాడారు. బోనాల వేడుకల ద్వారా ప్రజల మధ్య ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత పెరగడానికి దోహదం చేస్తాయని ఉపయోగపడ్డారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కార్యాలయ ఇన్చార్జి హనుమంత రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ వినోద్ కుమార్, జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి కృష్ణ,తెలంగాణ ఉద్యమ నాయకురాలు జానకి రెడ్డి, మహిళా జన సమితి రాష్ట్ర నాయకురాలు మెదక్ సక్కుబాయి , రేఖ, ఉష, స్వాతి, శాంతి, పద్మ,పెంటమ్మ, చంద్రకళ,సుగుణమ్మ, సబితమ్మ, కవిత, జలిజమ్మ,



మహాలక్ష్మి,పుష్ప,ఎం లక్ష్మి,డి లక్ష్మి నగర నాయకులు హనుమంత్ గౌడ్, జయపాల్ రెడ్డి కాకునూరి సుధాకర్,సురేష్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు గాంధీ భవన్ సమీపంలోని అమ్మవారి దేవాలయంకు చేరుకున్న అనంతరం మహిళలు బోనాలు చెల్లించారు.

# రూ. 100.15 కోట్లతో స్కూళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ శంకుస్థాపన

- విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాం: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నందారం నరసింహ గౌడ్
- బీరంగూడ, అమీన్‌పూర్ పరిధిలో ఘనంగా భూమిపూజ కార్యక్రమాలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పటాన్ చేరు ఆగష్టు 23 మీ వార్త ప్రతినిధి :





పటాన్‌చెరు నియోజకవర్గంలో విద్యారంగ సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, పేద విద్యార్థులకు అత్యాధునిక కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ అన్నారు.ఆదివారం నాడు బీరంగూడ మరియు అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలో సుమారు రూ. 100.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న అత్యాధునిక "క్యూర్ అర్బన్ రీజియన్ స్కూళ్ల" నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా శంకుస్థాపనలు చేశారు.బీరంగూడ డివిజన్ కిష్టారెడ్డిపేట.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 18.00 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న క్యూర్ అర్బన్ రీజియన్ స్కూల్ పనులకు భూమిపూజ.అమీన్‌పూర్ డివిజన్ డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో డబుల్ బెడ్రూం కాలనీ పరిసరాల్లో రూ. 49.15 కోట్ల భారీ నిధులతో నిర్మించనున్న పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన.అమీన్‌పూర్ డివిజన్ నవ్య రోడ్డు - రూపశ్రీ కౌంటీ ఎదురుగా):రూపశ్రీ కౌంటీ ఎదురుగా రూ. 33.00 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పాఠశాల భవన నిర్మాణ పనులకు శిలాఫలకం ఆవిష్కరణ.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ఒకేసారి పాఠశాలల నిర్మాణాల కోసమే రూ. 100 కోట్లకు పైగా నిధులు కేటాయించడం ఎంతో గర్వకారణమని, ఇది ప్రాంతీయ విద్యారంగంలో ఒక సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు, సకల మౌలిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలోనే పాఠశాలలను అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంఈఓ సుధాకర్ , స్థానిక కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, కొల్లూరు గోపాల్, జగదీష్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, ఇతర ముఖ్య నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చందుపట్ల కీర్తి రెడ్డి

పరకాల ప్రతినిధి మన మీ వార్త

పరకాల: ఈరోజు పరకాల లలిత కన్వెన్షన్ హాల్‌లో శాయంపేట మండల వాస్తవ్యులు దుంపల సరోజన--రాజిరెడ్డి దంపతుల కుమారుడు తిరుపతి రెడ్డి, పావని రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాయరాకుల మొగిలి , మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ , జిల్లా కౌన్సిల్ సభ్యులు కానుగుల నాగరాజు గారు, బూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి , సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీభవన్‌లో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ భేటీ

- పార్టీ బలోపేతం...క్రమశిక్షణపై కీలక చర్చ
- సమావేశానికి హాజరైన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 23 మీ వార్త

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. పార్టీ సంస్థాగత బలోపేతం, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.ఎఐసీసీ జనరల్ సెక్రటరీ సచిన్ సావత్, మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ఓబీసీ చైర్మన్ కోట్ల రవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్యా నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఓటర్ల జాబితాపై సమీక్ష,ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి ప్రతినిధులు చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించారు. ఓటర్లకు కల్పించిన అవగాహన, జాబితాలో మార్పులు--చేర్పులపై ప్రజలకు మరింత స్పష్టత కల్పించడం, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై నాయకులు చర్చించారు.పార్టీ కార్యాలయాలపై దృష్టి,జిల్లాల వారీగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణం, వాటిని కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేయడంపైనా సమావేశంలో చర్చ జరిగింది. పార్టీ కార్యాలయాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేసే వేదికలుగా ఉండాలని నాయకులు అభిప్రాయపడ్డారు. క్రమశిక్షణకు ప్రాధాన్యం,ఇటీవల పార్టీకి సంబంధించిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు, వాటి కారణంగా ఏర్పడిన గందరగోళ పరిస్థితులపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయకుండా నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ పాటించాలని సూచించారు. అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపైనే చర్చించి పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ ఐక్యతను కాపాడాలని స్పష్టం చేశారు.గ్రామస్థాయి నుంచే



బలోపేతం,గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యకర్తలతో సమన్వయం పెంచుకోవాలని నాయకులకు సూచించారు.

వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరు కావడం జిల్లాలో పార్టీ సంస్థాగత వ్యవహారాలపై కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సమావేశం లో తెలిపారు...

# లక్ష్మీ సాయి మెడోస్ నూతన అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి ఎన్నిక

పటాన్ చేరు ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి :

- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆశీస్సులుతీసుకున్న నూతన ప్రెసిడెంట్
- రామకృష్ణారెడ్డికి శాలువాతో ఘన సత్కారం



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీ సాయి మెడోస్ అసోసియేషన్ నూతన ప్రెసిడెంట్‌గా రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధించారు.లక్ష్మీ సాయి మెడోస్ అసోసియేషన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**నందారం నరసింహ గౌడ్ ఆశీర్వాదం:**

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం నూతన ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి... అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ గారు రామకృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ సమగ్ర అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుండాలని ఆయన సూచించారు.అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ...



పెద్దలు నందారం నరసింహ గౌడ్ గారి ఆశీస్సులు, కాలనీ వాసుల సహకారంతోనే తాను ఈ భారీ విజయాన్ని సాధించానని తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, కాలనీ ప్రగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- మహిళా డిగ్రీ కళాశాలలో నాలుగు పోస్టులు
- 25లోగా దరఖాస్తులు...27న ఇంటర్వ్యూలు
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు మీ వార్త

వనపర్తి జిల్లా : వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు విభాగాల్లో ఖాళీలు,కళాశాలలో కంప్యూటర్ సైన్స్--1, వాణిజ్యశాస్త్రం (బిఎఫ్ఎస్ఐ )--1, తెలుగు--1, ఆంగ్లభాష--1 చొప్పున మొత్తం నాలుగు అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం




మార్కులతో పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నెట్ /సెట్ , పిహెచ్ .డి తో పాటు గత విద్యా సంవత్సరం వరకు బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులకు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు.25న దరఖాస్తులకు చివరి గడువు,అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను ఆగస్టు 25, 2026 సాయంత్రం 4 గంటలలోపు వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సమర్పించాలని ప్రిన్సిపల్ సూచించారు.27న ఇంటర్వ్యూలు...దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 27, 2026 ఉదయం 10 గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వనపర్తిలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకురావాలని సూచించారు.అర్హత ఉన్న అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య కోరారు...

## మల్లాపూర్‌లో వైభవంగా బీరప్ప మహంకాళి బోనాలు

మల్లాపూర్, ఆగస్టు 23 ( మన మీ వార్త):



మల్లాపూర్‌లోని బీరప్ప మహంకాళి దేవస్థానంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. డోలు, తాళాలు, మేళాల నడుమ భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి బీరప్ప స్వామి, మహంకాళి అమ్మవారు, మల్లన్న స్వామి, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగాయి. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ, ఉప్పల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి చౌదరపల్లి పర్వతాలు కురుమ బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలందరినీ భగవంతుడు చల్లగా చూడాలని ఆయన ప్రార్థించారు. బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## ఏకగ్రీవంగా నూతనంగా ప్రెస్ క్లబ్ అభ్యర్థిగా కోటిని ఎన్నుకున్నారు

పరకాల ప్రతినిధి మన మీ వార్త



రేగొండ మండల కేంద్రంలో ఆదివారం అడక్ కమిటీ సభ్యులు కటకం రాజు, అంబాల రవీందర్, బండి సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి రేగొండ మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలకు మొత్తం 33మంది (అక్రిడేశన్, పిడీఎఫ్, యూ ట్యూబ్, డిజిటల్ మీడియా) జర్నలిస్ట్ లకు గాను 21మంది జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ ఎన్నికలలో ఉమ్మడి రేగొండ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడుగా పట్టెం కోటి నిలి జర్నలిస్టు లు అందరూ ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ... జర్నలిస్ట్ ల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే తనపై నమ్మకంతో అధ్యక్ష పదవికి సహకరించిన జర్నలిస్ట్ లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

**కమిటీ సభ్యులు:-**

గౌరవ అధ్యక్షుడు:- కటకం రాజు
గౌరవ సలహాదారుడు:- బోట్ల ప్రవీణ్
ప్రధాన కార్యదర్శి:- పకిడే నవీన్
ఉపాధ్యక్షులు:- రోంటాల శంకర్, బండారి రాజు
కోశాధికారి:- బండి కమలాకర్
సహాయ కారదర్శిలు:- మోటం రాజు, మంతెన మధు
సంయుక్త కార్యదర్శి:- బండారి తిరుపతి
ప్రచార కార్యదర్శి:- గునుకంటి రాకేష్

**కార్యవర్గ సభ్యులు:-**

బొమ్మకంటి నవత్ ,మ్యాదరబోయిన రాజు, మార్తా రాజు

ఈ కార్యక్రమంలో ఎండి.రహీం, మంతెన సురేష్, అక్కల రమేష్, అమ్మ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావంతోనే ఆధ్యాత్మిక శక్తి:

- బోనాల ఉత్సవాల్లో మేడ్చల్ బీ ఆర్ ఎస్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి

జవహర్ నగర్ ఆగస్టు 23: (వార్త ప్రతినిధి)



ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, భక్తి భావానికి శక్తి భావానికి అవినాభావ సంబంధం ఉందని మేడ్చల్ నియోజకవర్గం బీ ఆర్ ఎస్ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. జవహర్ నగర్ లో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన మాజీ మేయర్ మేకల కావ్య, బీ ఆర్ఎస్ జవహర్ నగర్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ తో కలిసి పాల్గొని, వివిధ ఆలయాలను దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముగ్గురమ్మల మూలపుటమ్మలైన పోచమ్మ, మారమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ, కాలికాంబ, సింహవాహిని మాతల కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తిభావంతో ఏ పనైనా సాధించవచ్చని, అమ్మవార్ల దయతోనే రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురుస్తూ సమృద్ధిగా పంటలు పండుతున్నాయని తెలిపారు. తల్లుల దివ్య దీవెనలు జవహర్ నగర్ ప్రజలతో పాటు యావత్ తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ లభించాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలూరి సంగీత రాజశేఖర్, బీ ఆర్ ఎస్ నాయకులు జిట్టా శ్రీనివాసరెడ్డి, బండ కింద ప్రసాద్ గౌడ్ పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం



కాసిపేట, ఆగస్టు 23 : (మన మీ వార్త మండల ప్రతినిధి)

కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై దేవాపూర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికులు, యూనియన్ నాయకులు, పర్మినెంట్ కార్మికులు పాల్గొని తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ప్రధానంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, పర్మినెంట్ వర్కర్లు, లోడింగ్ వర్కర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను త్వరితగతిన కల్పించాలని కోరారు. కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలని, చిన్నచిన్న సమస్యల విషయంలో కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తున్న హెచ్ఆర్ విభాగం తన ధోరణిని మార్చుకోవాలని సమావేశంలో పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ ఉద్యోగులకు సీనియారిటీ, సర్వీసు ఆధారంగా అందుతున్న ప్రయోజనాలను వేజ్‌బోర్డు ఉద్యోగులకు కూడా సమానంగా అందించాలని డిమాండ్ చేశారు.కార్మికులకు సంబంధించిన పెండింగ్ సమస్యలన్నింటినీ ప్రస్తుత గుర్తింపు సంఘం అధ్యక్షుడితో కలిసి అదానీ యాజమాన్యం దృష్టికి ఐక్యంగా తీసుకెళ్లి చర్చించాలని, కార్మికుల హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో పుస్కూరి విక్రమ్‌రావు, ఏనుగు తిరుపతిరెడ్డి, ఆడ జంగు, మాడవి అనంతరావు, పన్నాల మహేష్, అట్టపెల్లి శ్రీనివాస్, వద్లూరి మల్లేష్ తదితరులు, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.

## హనుమకొండ నేడు ప్రజావాణి కార్యక్రమం

- జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి వినతుల స్వీకరణ

మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

## వరంగల్, జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుంది జిల్లా కలెక్టర్

మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహిస్తారని, ఈ ప్రజావాణిలో అధికారులు పాల్గొని ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ కోరారు.

## పాప హరీశ్వరునికి ప్రత్యేక పూజలు



**బాసర :** బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాపహరేశ్వర ఆలయంలో ఆదివారం శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా స్వామివారికి అర్చకులు నాగేష్ అప్ప ఆధ్వర్యంలో రుద్రాభిషేకం,అన్నపూజ, హర్చన,హారతి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికీ అన్న దానం నిర్వహించారు సోమ వారం రోజు శ్రీ పాప హరేశ్వర నూతన ఆలయ కమిటీ కార్యవ ర్గాన్ని ఎన్నుకుంటామని సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,విడిసి అధ్యక్షుడు లింగారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమా నికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలనీ కోరారు.

## వరంగల్, జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుంది జిల్లా కలెక్టర్





మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.
జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహిస్తారని, ఈ ప్రజావాణిలో అధికారులు పాల్గొని ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ కోరారు.

## "జుగా" ప్రోగ్రాం కింద నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు

ఖానాపురం ఆగస్టు23(వార్త ప్రతినిధి ) :



ప్రతి ఇంటికి నాణ్యమైన , నిరంతర విద్యుత్ అందించాలనే ముఖ్య ఉద్దేశంతో, సర్పంచ్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో పెద్దమ్మ గడ్డ తండాలో "జుగా" ప్రోగ్రాం కింద తండా మొత్తం నూతన విద్యుత్ లైన్లను, స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగింది.పాత లైన్ల వల్ల తరచూ లో-వోల్టేజీ, విద్యుత్ అంతరాయం సమస్యలు ఉండేవి. సర్పంచ్ ప్రత్యేక చొరవతో విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ఈ నూతన లైన్ల పనులు చేపట్టారు. దీని ద్వారా తండాలోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన కరెంటు అందనుంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పు రాజు వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్ గ్రామస్తులు పల్నాటి శ్రీనివాస్, వల్లెపు శ్రీనివాస్, కందుల సాంబయ్య, భూక్య నవీన్, గుగులోతు గణేష్, తండా వాసులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చందుపట్ల కీర్తి రెడ్డి



పరకాల ప్రతినిధి మన మీ వార్త

పరకాల: ఈరోజు పరకాల లలిత కన్వెన్షన్ హాల్‌లో శాయంపేట మండల వాస్తవ్యులు దుంపల సరోజన--రాజిరెడ్డి దంపతుల కుమారుడు తిరుపతి రెడ్డి, పావని రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ సందర్భంగా నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆమె ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాయరాకుల మొగిలి , మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ , జిల్లా కౌన్సిల్ సభ్యులు కానుగుల నాగరాజు గారు, బూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి , సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నల్లపోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల కు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





చిలుకా నగర్, ఆగస్టు 23 ( మన మీ వార్త):

చిలుకా నగర్ హెచ్‌పీ పెట్రోల్ పంపు వెనుక కాలనీలో తెలంగాణ , సంప్రదాయాలకు ప్రతీకగా శ్రీ నల్లపోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు, తొట్టెల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.యశ్వంత్ రెడ్డి, అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీ నల్లపోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండు గ తెలంగాణ ప్రజల ఆత్మీయతకు, భక్తికి, గొప్ప సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నల్లపోచమ్మ తల్లిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, పల్లె నర్సింగరావు, ఈరెల్లి రవీందర్ రెడ్డి, పొట్టేళ్ల రాజు సదానంద్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులపాటు ఘనంగా TOSA--OASISCON 2026 ఆర్థోపెడిక్ సౌత్ ఇండియన్ కాన్ఫరెన్స్

మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.






హనుమకొండ, ఆగస్టు 23: హనుమకొండలో మూడు రోజులపాటు నిర్వహించిన ప్రతిష్ఠాత్మక TOSA--OASISCON 2026 -- Orthopaedic Association of South Indian States Conferenceవ ఘనంగా ముగిసింది. దేశ నలుమూలల నుంచి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు, నిపుణులు పాల్గొని ఆధునిక ఆర్థోపెడిక్ వైద్యంలో వస్తున్న నూతన సాంకేతికతలు, చికిత్సా విధానాలు, శస్త్రచికిత్సా పద్ధతులపై తమ అనుభవాలను పంచుకున్నారు.
ూూూ×ూ అధ్యక్షులు డా. పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ...
ూూూ×ూ అధ్యక్షులు డా. పెసరు విజయచందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ుూూ--ూూూ×ూజూచీ 2026ను వరంగల్‌లో విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ సదస్సుకు హాజరై తమ నైపుణ్యం, అనుభవాన్ని పంచుకోవడం ద్వారా సదస్సు ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు.
ఆధునిక వైద్య రంగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రోబోటిక్ సర్జరీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), జాయింట్ రీప్లేస్‌మెంట్, స్పైన్ సర్జరీ వంటి నూతన విధానాలపై వైద్యులు నిరంతరం అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువ వైద్యులకు సీనియర్ వైద్యుల అనుభవం అందేలా ఇలాంటి సదస్సులు, జవీజులు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.
ూూూ×ూ అధ్యక్షుడిగా తన బాధ్యతల్లో భాగంగా దక్షిణ భారతదేశంలోని ఆర్థోపెడిక్ వైద్యుల మధ్య జ్ఞాన మార్పిడి, వైద్య విద్య, శిక్షణ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ుూూ--ూూూ×ూజూచీ 2026 విజయవంతం కావడానికి సహకరించిన వైద్యులు, స్పీకర్లు, నిర్వాహకులు, వాలంటీర్లు మరియు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సదస్సులో ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డా. వేదుల సత్యనారాయణమూర్తి వీవఎశీతీఖుశ్రీ ూతీణ్‌అశీఅ (స్మారక ఉపన్యాసం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థోపెడిక్ వైద్య రంగానికి, వైద్య విద్యకు అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన సేవలు, వైద్య రంగంలో చేసిన కృషి నేటి తరం వైద్యులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ుూూ అధ్యక్షులు డా. కె. రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ..
ూూూ×ూ సెక్రటరీ జనరల్ డా. కె. రామ్‌కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, ుూూ--ూూూ×ూజూచీ 2026లో నిర్వహించిన శాస్త్రీయ కార్యక్రమాలు వైద్యులకు ఎంతో విలువైన అనుభవాన్ని అందించాయని తెలిపారు.
ూఱఅవ ఱవవశీఅర్‌తీఖఅశీఅం, ఘుఖ దీశీఅవ ఔశీతీఎంప్త్రశీజూం, ఘుఅఎం-శీఅ ఐతీఘుఱఅఱఅస్త్ర ద్వారా వైద్యులు కేవలం సైద్ధాంతిక పరిజ్ఞానమే కాకుండా ఆధునిక శస్త్రచికిత్సా విధానాలను ఆచరణాత్మకంగా తెలుసుకునే అవకాశం పొందారని అన్నారు.
దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా తమ అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం కలిగిందన్నారు. భవిష్యత్తులో ూూూ×ూ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికతలు, పరిశోధనలు, జవీజులు మరియు ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వరంగల్‌లో ఇంతటి భారీ సౌత్ ఇండియా స్థాయి ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ విజయవంతం కావడం సంతోషకరమని, సదస్సు విజయవంతానికి కృషి చేసిన నిర్వాహకులను అభినందించారు.
ఈ సదస్సులో భాగంగా తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (ుూూ) అధ్యక్షులుగా హైదరాబాద్ కు చెందిన డా. అల్వాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనకు శు భాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో డా. వద్దిరాజు రాకేష్, డా. పి. సుధీర్ కుమార్, డా. మహేశ్వర్, డా. శ్రవణ్, డా. బంగారు స్వామి, డా. శిరీష్ తదితర ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు.

# సర్ రెండో దశపై ఉప్పల్ బీజేపీ కార్యాచరణ సమావేశం

--- బి ఎల్ ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో

రామంతాపూర్, ఆగస్టు 23 ( మన మీ వార్త):



సర్ ఓటరు సమగ్ర సవరణ రెండో దశకు సంబంధించి ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ కార్యాచరణ సమావేశం రామంతాపూర్ డివిజన్‌లో బి ఎల్ ఏ-1 పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చే పార్టీ అని, పార్టీని నమ్ముకుని క్రమశిక్షణతో, నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలను పార్టీ ఎప్పటికీ గుర్తిస్తుందని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన నాయకులను గుర్తించి, వారి సీనియారిటీకి అనుగుణంగా టికెట్లు కేటాయిస్తామని తెలిపారు..పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలు, కార్యాచరణకు లోబడి పనిచేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం, రాష్ట్రంలో బీజేపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే చర్యలను ఏమాత్రం సహించేది లేదని ప్రభాకర్ స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సర్ జిల్లా కన్వీనర్ నందనం దివాకర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఉప్పల్ నియోజకవర్గం ఎంతో ముందంజలో ఉందని తెలిపారు. ఇప్పటికే సర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న బి ఎల్ ఏ-2లు, బూత్ కోఆర్డినేటర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లను అభినందించారు. ఇదే ఉత్సాహంతో సర్ రెండో దశను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సర్ ఒక మహత్తరమైన కార్యక్రమమని, దీనిని నీరుగార్చేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని వారు ఆరోపించారు. రెండో దశలో ప్రజలు మరింత




అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు జారీ చేసే నోటీసులను అందుకున్న ఓటర్లు, అందులో కోరిన పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని కోరారు. ూ×=కు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే స్థానిక బీజేపీ కార్యకర్తలను సంప్రదించాలని ప్రభాకర్ ప్రజలకు సూచించారు. ప్రజలకు సేవ చేసేందుకు బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవినాయక్, సర్ జిల్లా కన్వీనర్ నందనం దివాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొరిగే కృష్ణ, మాజీ కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. బూత్ కోఆర్డినేటర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బి ఎల్ ఏ-2లు, ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాధిత కుటుంబాలకు బాసటగా మన ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

## - ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య.

మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం ఉదయం చర్లపాలెం గ్రామంలో కీ,శే,లు మేకపోతుల సత్తెమ్మ అకాల మరణం చెందగా వారి మొదటి సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ప్రభుత్వం అంటేనే ప్రజల పక్షాన ఉంటూ బడుగు బలహీనుల బలోపేతానికి వారి వ్యక్తిగత వికాసానికి తోడ్పాటును,చేయూతనందిస్తుందని, బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.
అనంతరం చైర్మన్ రాజయ్య మీడియాతో మాట్లాడుతూ నేటి యువత-రేపటి భవిత అని ప్రజల కోసం ఏర్పడిన ప్రజాస్వామ్య దేశంలో యువత రాజకీయాల్లోకి రావాలని,దేశ భవిత యువత రాజకీయాలపై ఆధారపడి ఉందని,పేద ధనిక లింగ బేధ ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సమాన ఓటు హక్కు కల్పించారని, ఐదు సంవత్సరాలకోసారి, ఎన్నికల నిర్వహణ,రిజర్వేషన్ ప్రక్రియ, నచ్చినవారికి ఓటు వేసే స్వేచ్ఛా హక్కులు కల్పించబడిందని, ప్రజాస్వామ్య పునాదులు మన గ్రామ పంచాయితీలని, ఆర్థిక స్వలంబన బలోపేతానికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయనైనదని, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపారమైన నమ్మకంతో, స్థానిక స్వయం పరిపాలన సంస్థల్లో అనుభవం ఉన్న నాకు బాధ్యతలు అప్పగించారని, చిత్తశుద్ధితో ప్రతి మారుమూల గ్రామ పంచాయితీల అభివృద్ధి ధ్యేయంగా వ్యవస్థకు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!

సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహా అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది.

# గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు

పరకాల ప్రతినిధి మన మీ వార్త

నడికూడ మండలంలోని నార్లాపూర్,వెంకటేశ్వర్లపల్లి, వరికోల్,ముస్త్యాలపల్లి, చౌటుపర్తి గ్రామాల్లో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీల ఏర్పాటులి

దనడికూడ: టీపీసీసీ, డీసీసీ మరియు పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో నార్లాపూర్, వెంకటేశ్వర్లపల్లి, వరికోల్, ముస్త్యాలపల్లి, చౌటుపర్తి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీల ఏర్పాటు కోసం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అబ్జర్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లా రమేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోరిగేం స్వామి పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి,



పాలన సజావుగా సాగేందుకు నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని అధిష్టానం పిలుపు మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. గ్రామ నాయకత్వంలో పని చేయడానికి ఆసక్తి గల నూతన కమిటీ మరియు కార్యవర్గ సభ్యుల పేర్లను స్వీకరించడం జరిగిందని, త్వరలో అధిష్టానం గ్రామ కమిటీల పేర్లను ప్రకటిస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, జిల్లా కార్యదర్శి బచ్చుటి మోహన్ రావు, జిల్లా సెక్రటరీ ముక్కెర సురేష్ ,నడికూడ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు పెద్దబోయిన రవీందర్ యాదవ్,మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ శీ డి మీ స్ చైర్మన్ గోల్కొండ సాధనందం,క్లస్టర్ ఇంచార్జి పాడి వివేక్ రెడ్డి, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, బూత్ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు,యూత్ కాంగ్రెస్, హ ఎం యు ఈ నాయకులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 22ఎ జాబితాను వెంటనే రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తాం..

- సచివాలయాన్ని ముట్టడిస్తాం: మాజీ మంత్రి హరీశ్ రావు
- ప్రజల ఆస్తులను లాక్కుంటే కాంగ్రెస్ పార్టీ మాడి మసైపోవడం ఖాయం.
- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే రాహుల్ గాంధీ చోద్యం చూస్తున్నారా?
- 30 శాతం కమీషన్ల కోసమే పక్కా రిజిస్టర్డ్ ఇళ్లను నిషేధిత జాబితాలో పెడుతున్న సర్కారు

బోడుప్పల్ సర్కిల్ ఆగస్టు23( మన మీ వార్త):-

భూభారతి పోర్టల్ నుంచి 22A జాబితాను రాత్రికి రాత్రే ఎందుకు మాయం చేశారు? పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి.

బోడుప్పల్ 22ఎ బాధితులకు బాసటగా బీఆర్ఎస్.. సమావేశానికి హాజరై అండగా నిలిచిన హరీశ్ రావు.

బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి, హేమానగర్ కాలనీలను ప్రభుత్వం అకారణంగా 22ఎ నిషేధిత జాబితా లో చేర్చిన నేపథ్యంలో.. తీవ్ర ఆందోళనలో ఉన్న ఆయా కాలనీల వాసులకు బాసటగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు హాజరై బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మంద సంజీవరెడ్డి, బోడుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితర స్థానిక నాయకులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వం అనేది ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి పని చేయాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు లేని సమస్యలు సృష్టించి వారిని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలు కడుపుకట్టుకుని, పచ్చడి మెతుకులు తిని, రూపాయి రూపాయి కూడబెట్టుకుని బ్యాంకుల్లో అప్పులు తెచ్చి ఇళ్లు కట్టుకుంటారు. ఇక్కడ సమావేశంలో స్వప్న అనే సోదరి మాట్లాడుతూ.. పిల్లల పైచదువుల కోసం విదేశాలకు పంపేందుకు ఇల్లు కుదువబెట్టి లోన్ తీసుకుందామంటే మా ఇల్లు 22ఎ లో ఉందని బ్యాంకులు అప్పు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేసింది. బిడ్డ పెళ్లికో, ఆపదకో ఇల్లు అమ్ముకుందామన్నా అమ్ముకోలేని అయోమయ పరిస్థితిలోకి నెట్టేశారు.

1998లో, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాం 2008లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ ను ఎత్తేశారు. ఎప్పుడో రద్దయిన చట్టాన్ని మళ్లీ తెచ్చి, పట్టా భూములను 22ఎ నిషేధిత జాబితాలో పెట్టి వసూళ్లకు పాల్పడాలని చూస్తున్నారు.

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రభుత్వ భూములను, ఎస్సీల అసైన్డ్ భూములను సైతం తెగనమ్ముతోంది. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డులో ఉన్న 1000 గజాల పార్కును కూడా అమ్మకానికి పెట్టారు. ఆఖరికి గుడి కట్టడానికో, బడి కట్టడానికో, దవాఖానాకో, స్మశానానికో కూడా జాగ లేని పరిస్థితి సృష్టించారు. మరోవైపు కూకట్ పల్లిలోని 1000 గజాల ప్రైవేటు ప్లే గ్రౌండ్‌ను కూడా ప్రభుత్వం తనదే అంటోంది.

రాత్రికి రాత్రే ఇళ్లను ఖూజ కింద 22ఎ లో దేనికోసం పెడుతున్నారు? ఇదంతా కేవలం 30 శాతం కమీషన్లు లాగడానికే. దళారులు వెళ్లి యజమానులను 30 శాతం కమీషన్ అడుగుతున్నారు.





తప్పు చేసి నిషేధిత జాబితాలో పెట్టింది మీరు.. మీ కమీషన్ల కోసం చేసిన తప్పుకు సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలి? ఎందుకు అప్లికేషన్లు పెట్టుకోవాలి? ఇలా ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవాలని ఆలోచించడమే కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ చర్య.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి .. తప్పు చేసింది మీరు, కేవలం క్షమాపణలు చెప్పి తప్పించుకోవాలని చూడకండి.

అప్లికేషన్లతో సంబంధం లేకుండా ఆ భూములను 22ఎ నుంచి తొలగించాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. అధికారులు చేసిన తప్పు వెనుక దాక్కుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఏకంగా 40 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారు. ఆఖరికి అమీన్పూర్ పోలీస్ స్టేషన్ కూడా 22ఎ లోనే ఉంది. మొత్తం హైదరాబాద్ అంతా.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సరూర్ నగర్ లాంటి ప్రాంతాలన్నీ ఈ జాబితాలోనే ఉండటం ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డే చెప్పారు.

చిన్న చిన్న విషయాలకు సీఐడీ, విజిలెన్స్ ఎంక్వయిరీలు వేసి బీఆర్ఎస్ నాయకులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం.. మరీ ఇంతపెద్ద తుగ్లక్ నిర్ణయం తీసుకున్న అధికారులపైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..

ఢిల్లీలో 'నీట్' పరీక్ష పేపర్ లీకు గురించి యువత తిరగబడితే.. కేంద్ర మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. నువ్వు చేసిన అవినీతి, స్కాములను ప్రజలు ఇన్నాళ్లూ భరించారు.. కానీ ఇప్పుడు వాళ్ల సొంత ఇళ్లనే లాక్కుంటే మాత్రం ఊరుకునే పరిస్థితి లేదు.

తక్షణమే ఈ సమస్య పరిష్కరిస్తారా? లేక ప్రజల పాదాల కింద నలిగిపోతారో తేల్చుకోండని హెచ్చరిస్తున్నాం.

కాంగ్రెస్ హైకమాండ్ ఈ రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో పెట్టింది. ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇద్దరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులే.

వీళ్లు రాష్ట్రాన్ని అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే.. రాహుల్ గాంధీ చోద్యం చూస్తున్నారా?

మీకు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం మాత్రమే తెలుసు.. కానీ బీఆర్ఎస్ పార్టీకి ప్రజల పక్షాన పోరాటం చేయడం తెలుసు, మీ మెడలు వంచడం తెలుసు. మీ మెడలు వంచైనా సరే ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ప్రజల ఇళ్లను 22ఎ జాబితా నుంచి తొలగించకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తాం.. అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తాం.

ఎటువంటి పోరాటానికైనా బీఆర్ఎస్ సిద్ధం. ఈ జాబితాలను తొలగించకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాడి మసైపోవడం ఖాయం.

వాస్తవానికి ఆన్లైన్లో భూభారతి రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో 22ఎ నిషేధిత జాబితాలను ప్రభుత్వం పూర్తిగా మాయం చేసింది.

మొత్తం హైదరాబాద్ నగరాన్నే ఈ పోర్టల్ నుంచి బ్లాక్ చేశారు. ఎందుకు రాత్రికి రాత్రి ఈ పోర్టల్‌ను మాయం చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

ఈ బ్లాకింగ్ పేరు మీద రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఇంకేమైనా విలువైన ల్యాండ్లను కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారా? తక్షణమే 22ఎ ప్రొహిబిషన్ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, వివరాలు బయటపెట్టాలని బీఆర్ఎస్ పక్షాన తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాం.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**



**జన్నారం** : జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయక పోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

## మంచిర్యాలలో కాంగ్రెస్ లొల్లి పేరుతో అసత్య ప్రచారం తగదు

**6వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఏ వర్గంలో చేరలేదు**

**సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మంచిర్యాల** : మంచిర్యాలలో కాంగ్రెస్‌లో లొల్లి అంటూ ఓ పత్రికలో (ప్రజాజ్యోతి కాదు ) ప్రచురితమైన కథనంలో 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఒక రాజకీయ వర్గంలో చేరినట్లు పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఆ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. వ్యక్తిగత పోకడలు, స్వప్రయోజనాల కోసం రాజకీయంగా నిబద్ధతతో పనిచేస్తున్న వ్యక్తులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మేకల అశ్విని ఎలాంటి రాజకీయ వర్గ మార్పులకు పాల్పడలేదని, కమ్యూనిస్టు పార్టీ పట్ల నిబద్ధతతో, సిద్ధాంతపరమైన విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారని రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తుల పేర్లను రాజకీయ వర్గాలతో ముడిపెట్టి వార్తలు రాయడం సరికాదన్నారు. “బూర్జువా సంస్కృతిని కమ్యూనిస్టులకు అంటకట్టవద్దు. మేము నిలకడగా, నిబద్ధతతో పనిచేసే వాళ్లం” అని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తమ రాజకీయ విధానాలను మార్చుకునే వారు కాదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సిద్ధాంతపరంగా ముందుకు సాగుతారని తెలిపారు. ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను తెలుసుకోకుండా ప్రచురించినా అది “సూర్యుడిపై ఉమ్మివేయడానికి ప్రయత్నించినట్టే” అవుతుందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కమ్యూనిస్టుల నిబద్ధతను దెబ్బతీయలేరని రామడుగు లక్ష్మణ్ అన్నారు. పత్రికలో ప్రచురితమైన సదరు కథనంలోని తప్పుడు సమాచారాన్ని వెంటనే సరిదిద్ది, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓూఔ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్దలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు.రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్‌ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**

**జన్నారం** : జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరా ముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయక పోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు.లో క్సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రొరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి. పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, 'ప్రొరోగ్' కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రొరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ జరగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాకాల సమావేశాల విషయంలో మాత్రం పది రోజులు గడిచినా ఆ ఉత్తర్వులు జారీ కాలేదు.

**కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమా?**

ఈ ఆలస్యానికి కారణం ఏంటన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోయినా, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్ట సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడానికి అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్రం ముందుకు తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అంశం కీలకంగా మారింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే దీనిపై చర్చ జరిగినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమకూరకపోవడంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయిందనే ప్రచారం జరిగింది.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం ఒక ప్రత్యామ్నాయ ఫార్ములాపై కసరత్తు చేస్తోందనే చర్చ సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను సమాన ప్రాతిపదికన సుమారు 50 శాతం పెంచే ప్రతిపాదనపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. అలా చేస్తే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారా?**

స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తెచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు గతంలోనే వినిపించాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యం కావడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రత్యేక సమావేశం నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమీకరించి కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**కాంగ్రెస్ ప్రశ్నల వర్షం**

సెషన్ ప్రొరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ప్రొరోగ్? ఉత్తర్వులు ఎందుకు జారీ చేయలేదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేశారు. పది రోజులు గడిచినా ఇంకా ప్రొరోగేషన్‌పై సమాచారం లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైన మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. అయితే గతంలోనూ ప్రొరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయని జైరాం రమేశ్ స్వయంగా పేర్కొన్నారు. 2015లో వర్షాకాల సమావేశాల అనంతరం 28 రోజులు, 2021లో 20 రోజుల వ్యవధి ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే అప్పట్లో ప్రస్తుతం కనిపిస్తున్నట్లుగా ఎలాంటి రాజకీయ వ్యూహాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు.

**విజయ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**

డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఆగస్టు 21న మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కారణంగా ఏ రాష్ట్రానికీ పార్లమెంట్‌లో ప్రాతినిధ్య శాతం తగ్గకుండా కేంద్రం స్పష్టమైన చట్టపరమైన హామీ ఇవ్వాలని విజయ్ కోరారు. మరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వచ్చే 25 ఏళ్ల పాటు సీట్ల సంఖ్యను మార్చకూడదని కేంద్రాన్ని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్‌పై కేంద్రం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ఏదైనా కొత్త ఫార్ములాను ముందుకు తెస్తుందా? ప్రత్యేక సమావేశానికి తెరలేపుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## చేదెక్కిన చక్కెర

**ముంబై :** దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది.అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి .ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి.

# జనగాడ్రాగన్ ఫ్రూట్.. రైతు ఆదాయానికి కొత్త బాట



రైతు మేకల వెలంగన్ రెడ్డి, గుంటూరుపల్లి గ్రామం, నర్మెట్ట మండలం



రైతు షా బాలరెడ్డి, గుంటూరుపల్లి గ్రామం, నర్మెట్ట మండలం



**- వైవిధ్యమైన పంటలతో లాభదాయక వ్యవసాయం**

**మన మీ వార్త ఆగస్టు 23 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఉద్యాన సాగుతో వ్యవసాయానికి కొత్త దిశ
శాస్త్రీయ సాగుతో పత్తిలో మెరుగైన దిగుబడులు
కంది సాగుతో తక్కువ పెట్టుబడిలో అదనపు ఆదాయం
డ్రిప్‌తో నీటి పొదుపు.. శాస్త్రీయ సాగుతో దిగుబడి
పెంపు సబ్సిడీతో రైతుకు ప్రభుత్వ చేయూత
భూమి, నీరు, మార్కెట్.. పంట ఎంపికకు మూడు కీలక అంశాలు రైతు ఆదాయమే లక్ష్యంగా పంటల వైవిధ్యం

రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మార్కెట్ డిమాండ్, భూమి స్వభావం, నీటి లభ్యత, సాగు వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకుంటే తక్కువ వనరులతో మెరుగైన రాబడిని పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక విలువైన ఉద్యాన పంటలు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా నిలుస్తున్నాయి.

పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ వివిధ రకాల పంటలను (పత్తి, కంది, కూరగాయలు) సాగు చేయడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరీకరించుకోవచ్చు.

రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం అందించే ఉద్యాన, ఇతర పంటలను సాగు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉద్యాన, ఇతర పంటల సాగును మరింత విస్తరించవచ్చు.

ఈ నేపథ్యంలో జిల్లాలోని నర్మెట్ట మండలంలోని గుంటూరుపల్లి గ్రామ రైతులు సంప్రదాయ వరి సాగుకు భిన్నంగా ఆలోచిస్తూ, అధిక నీటి అవసరం ఉన్న పంటలకు దూరంగా ఉంటూ పంటల వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

గ్రామంలో రైతులు సమిష్టిగా డ్రాగన్ ఫ్రూట్, పత్తి, కందులు, కూరగాయలు, తదితర వివిధ పంటలను సాగు చేస్తూ ఆదాయ మార్గాలను విస్తరించుకుంటున్నారు.

ముఖ్యంగా తక్కువ నీటి వినియోగంతో, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగులో స్థిరత్వాన్ని సాధిస్తున్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడం వల్ల మార్కెట్ ధరల్లో మార్పులు వచ్చినా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు అందుబాటులో ఉంటాయి.

డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక విలువ కలిగిన పంటలతో పాటు పత్తి, కందులు, కూరగాయలను సాగు చేస్తూ గుంటూరుపల్లి రైతులు పంటల వైవిధ్యానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం సాధించే దిశగా రైతులు చేస్తున్న ఈ ప్రయత్నం ఇతర ప్రాంతాల రైతులకు కూడా స్ఫూర్తిదాయకంగా మారుతోంది.

**డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయం**

జిల్లాలోని నర్మెట్ట మండలం, గుంటూరుపల్లి గ్రామానికి చెందిన రైతు మేకల వెలంగన్ రెడ్డి డ్రాగన్ ఫ్రూట్ సాగు ద్వారా అధిక ఆదాయం సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు.

సుమారు 1.60 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (వీ×ణ౹) పథకం కింద రైతు వెలంగన్ రెడ్డికి రూ. 2.56 లక్షల సహాయం అందింది.

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఎకరాకు సాగు వ్యయం రూ. 2.40--2.50 లక్షలు కాగా, స్థూల ఆదాయం రూ. 6.40 లక్షలు కాగా, నికర ఆదాయం రూ. 3.90--4.00 లక్షలు లభిస్తోంది.

డ్రాగన్ ఫ్రూట్ తోట ఏర్పాటుకు అవసరమైన పందిరి నిర్మాణ ఏర్పాటుకు ఎకరాకు సుమారు రూ. 1.35 లక్షలు, మొక్కలకు రూ. 45 వేలు, డ్రిప్ ఇరిగేషన్‌కు రూ. 35 వేలు, భూమి తయారీకి రూ. 40--50 వేలు, బేసల్ అప్లికేషన్‌కు సుమారు రూ. 20 వేలు వరకు వ్యయం అయింది.

రెండో సంవత్సరం నుంచి ఎకరాకు సుమారు రూ. 73 వేల వరకు నిర్వహణ వ్యయం ఉండగా, సరైన నీటి యాజమాన్యం, పోషకాల వినియోగం, కలుపు నియంత్రణ, తెగుళ్ల నివారణ వంటి శాస్త్రీయ



పద్ధతులను పాటిస్తూ స్థిరమైన దిగుబడులు సాధిస్తున్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగులో నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు డ్రిప్ ఇరిగేషన్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు ఉపయోగపడుతున్నాయి.

**వివిధ రకాల కూరగాయల పంటలతో రైతులకు ఆదాయం**

డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు వివిధ రకాల కూరగాయ పంటలు కూడా రైతులకు మంచి ఆదాయ అవకాశాలను కల్పిస్తున్నాయి. టమాటా, వంకాయ, మిరప, బెండ, బీరకాయ, సొరకాయ, కాకరకాయ, ఫ్రెంచ్ బీన్స్ వంటి పంటలను మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. టమాటాకు ఎకరాకు సుమారు రూ. 96,996 వ్యయం కాగా, సుమారు రూ. 4.80 లక్షల స్థూల ఆదాయం, రూ. 3.83 లక్షల వరకు నికర రాబడి లభిస్తోంది.అదే విధంగా వంకాయకు రూ. 81,131 వ్యయం కాగా, సుమారు రూ. 3.60 లక్షల స్థూల ఆదాయం, రూ. 2.79 లక్షల వరకు నికర రాబడి లభిస్తోంది.

మిరపలో ఎకరాకు సుమారు రూ. 76,741 వ్యయంతో రూ. 3 లక్షల స్థూల ఆదాయం, రూ. 2.23 లక్షల వరకు నికర రాబడి పొందుతున్నారు.

ఫ్రెంచ్ బీన్స్, అమరాంతస్, బీరకాయ, సొరకాయ, కాకరకాయ వంటి పంటలు కూడా పెట్టుబడితో పోలిస్తే మెరుగైన రాబడిని అందించే అవకాశాలు కలిగి ఉన్నాయి.

**పత్తి, కంది సాగుతోనూ ఆదాయం**

జిల్లాలోని నర్మెట్ట మండలం, గుంటూరుపల్లి గ్రామానికి చెందిన రైతు షా బాలరెడ్డి14 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. పత్తి సాగులో ఎకరాకు సుమారు రూ. 35 వేల పెట్టుబడితో 9 యూనిట్ల దిగుబడి, రూ. 67,500 స్థూల ఆదాయం, సుమారు రూ. 32,500 నికర రాబడి లభిస్తోంది.

కంది సాగులో ఎకరాకు సుమారు రూ. 20 వేల వ్యయంతో 6 యూనిట్ల దిగుబడి, రూ. 48 వేల స్థూల ఆదాయం, సుమారు రూ. 28 వేల నికర రాబడి లభిస్తోంది.

పంటల వైవిధ్యంతో ఆదాయ మార్గాల విస్తరణ
ఒకే పంటపై ఆధారపడకుండా డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు వంటి అధిక విలువైన ఉద్యాన పంటలతో పాటు పత్తి, కంది వంటి పంటలను సమన్వయంతో సాగు చేయడం ద్వారా రైతులు వివిధ ఆదాయ మార్గాలను ఏర్పరచుకోవచ్చు. దీనివల్ల ఒక పంటకు మార్కెట్‌లో ధర తగ్గినా, ఇతర పంటల ద్వారా వచ్చే ఆదాయం రైతుకు కొంత మేర ఆర్థిక భద్రత కల్పించే అవకాశం ఉంటుంది.

పంటల వైవిధ్యం కేవలం ఆదాయాన్ని పెంచడమే కాకుండా, సాగు వనరుల సమర్థ వినియోగానికి కూడా దోహదపడుతుంది. నీటి లభ్యతను బట్టి తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం, పంటల కాలాన్ని సమన్వయం చేసుకోవడం, మార్కెట్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసుకోవడం ద్వారా రైతులు సాగు నిర్ణయాలను మరింత సమర్థవంతంగా తీసుకోవచ్చు.

**రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి**

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన మొక్కలు, తోటల ఏర్పాటు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై సంబంధిత శాఖల నుంచి సాంకేతిక మార్గదర్శకాలను పొందాలి.

రైతులు సాగు ప్రారంభించే ముందు పంటకు ఉన్న మార్కెట్ డిమాండ్, పెట్టుబడి, దిగుబడి, ధరల పరిస్థితి, రవాణా, నిల్వ సదుపాయాలు వంటి అంశాలను పరిశీలించాలి. ఉత్పత్తికి అనుగుణంగా మార్కెటింగ్ అవకాశాలను ముందుగానే గుర్తించుకోవడం ద్వారా పంటకు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుంది.

**భూమి స్వభావానికి అనుగుణంగా పంటల సాగుకు ప్రాధాన్యం : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక విలువ, అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక విలువైన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ భూమి స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయలు, ఉద్యాన పంటలు, పత్తి, కంది వంటి పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, సమతుల్య పోషకాల వినియోగం, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో సాగు వ్యయాన్ని తగ్గించి, దిగుబడులు, నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు.

రైతుల మాటల్లో..

శాస్త్రీయ సాగుతో డ్రాగన్ ఫ్రూట్‌లో అధిక ఆదాయం

"డ్రాగన్ ఫ్రూట్ సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించడం, సరైన నీటి యాజమాన్యం, పోషకాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాను. మొదటి ఏడాది తోట ఏర్పాటు కోసం పెట్టుబడి కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ, తోట ఏర్పాటైన తర్వాత నిర్వహణ ఖర్చు తగ్గుతుంది. సరైన యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తూ డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మంచి ఆదాయం పొందుతున్నాను."

రైతు వెలంగన్ రెడ్డి, గుంటూరుపల్లి గ్రామం, నర్మెట్ట మండలం మార్కెట్ ప... మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పత్తి సాగుతో అధిక ఆదాయం

"నేను 14 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను. పత్తిలో అధిక దిగుబడి సాధించాలంటే మొదటి నుంచి శాస్త్రీయ పద్ధతులు పాటించడం చాలా ముఖ్యం. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసి, సరైన సమయంలో విత్తాను. భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వాడుతూ, అవసరమైన నీటిని అందిస్తున్నాను. పంట ప్రారంభ దశ నుంచే కలుపు మొక్కలను నియంత్రిస్తూ, తెగుళ్లు, పురుగుల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సమగ్ర యాజమాన్య పద్ధతులు అమలు చేస్తున్నాను."

**రైతు షా బాలరెడ్డి, గుంటూరుపల్లి గ్రామం, నర్మెట్ట మండలం**

పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ అధిక విలువైన ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావడం ద్వారా రైతులు తమ ఆదాయ మార్గాలను విస్తరించుకునే అవకాశం ఉంది. డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు కూరగాయలు, పత్తి, కంది, ఉల్లి వంటి పంటలను భూమి స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఎంపిక చేసుకోవడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చు.

నర్మెట్ట మండలంలోని గుంటూరుపల్లి గ్రామ రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మలుచుకుంటున్నారు. ఈ గ్రామ రైతుల సాగు ప్రయాణం అధిక ఆదాయ మార్గంగా నిలుస్తుండటం విశేషం.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**



**జన్నారం** : జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయక పోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

## మంచిర్యాలలో కాంగ్రెస్ లొల్లి పేరుతో అసత్య ప్రచారం తగదు

**6వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఏ వర్గంలో చేరలేదు**

**సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మంచిర్యాల** : మంచిర్యాలలో కాంగ్రెస్‌లో లొల్లి అంటూ ఓ పత్రికలో (ప్రజాజ్యోతి కాదు ) ప్రచురితమైన కథనంలో 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఒక రాజకీయ వర్గంలో చేరినట్లు పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఆ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. వ్యక్తిగత పోకడలు, స్వప్రయోజనాల కోసం రాజకీయంగా నిబద్ధతతో పనిచేస్తున్న వ్యక్తులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మేకల అశ్విని ఎలాంటి రాజకీయ వర్గ మార్పులకు పాల్పడలేదని, కమ్యూనిస్టు పార్టీ పట్ల నిబద్ధతతో, సిద్ధాంతపరమైన విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారని రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తుల పేర్లను రాజకీయ వర్గాలతో ముడిపెట్టి వార్తలు రాయడం సరికాదన్నారు. "బూర్జువా సంస్కృతిని కమ్యూనిస్టులకు అంటకట్టవద్దు. మేము నిలకడగా, నిబద్ధతతో పనిచేసే వాళ్లం" అని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తమ రాజకీయ విధానాలను మార్చుకునే వారు కాదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సిద్ధాంతపరంగా ముందుకు సాగుతారని తెలిపారు. ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను తెలుసుకోకుండా ప్రచురించినా అది "సూర్యుడిపై ఉమ్మివేయడానికి ప్రయత్నించినట్టే" అవుతుందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కమ్యూనిస్టుల నిబద్ధతను దెబ్బతీయలేరని రామడుగు లక్ష్మణ్ అన్నారు. పత్రికలో ప్రచురితమైన సదరు కథనంలోని తప్పుడు సమాచారాన్ని వెంటనే సరిదిద్ది, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

**హైదరాబాద్** : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓజౌ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్దలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు. రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జిలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే.

# ఆటో డ్రైవర్ల బందుకు ఎంసీపీఐయూ సంపూర్ణ మద్దతు

## ఆటో డ్రైవర్లకు ఎన్నికల హామీలను అమలు చేయాలి

## ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్



**మంచిర్యాల** : రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఆదివారం అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న బందుకు ఎంసీపీఐయూ పార్టీ, అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఆటో డ్రైవర్లకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆటో వృత్తినే ప్రధాన జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని వెంకటేష్ ఆరోపించారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆటో డ్రైవర్లు చేపడుతున్న సమ్మె న్యాయమైనదని, వారి పోరాటానికి ఎంసీపీఐయూ పార్టీ, ఏఐసీటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని స్పష్టం చేశారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా సంవత్సరానికి రూ.12 వేల జీవనభృతిని అందించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఆటో కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత సేవల కారణంగా ఆటో కార్మికుల ఉపాధికి నష్టం కలుగుతోందని, వాటిని వెంటనే నిషేధించాలని వెంకటేష్ కోరారు. ఆటో డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, ప్రతి ప్రాంతంలో ఆటో స్టాండ్లు, ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేపట్టిన బందుకు ఎంసీపీఐయూ పార్టీ, దాని కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయని వెంకటేష్ తెలిపారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వారి పోరాటాల్లో భాగస్వాములవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, తొగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## సగం హైదరాబాద్ లో సెటిలర్స్ ప్రభావమే...

# 28 నియోజకవర్గాల్లో 15 చోట్ల డామినేషన్

**హైదరాబాద్** : ఆంధ్రా సెటిలర్స్ ఈసారి హైదరాబాద్‌లో ఓట్లేయడం లేదా.. అన్న విషయం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ తర్వాత భారీగా ఓట్లు కేటగిరీలోకి వెళ్లడం, మరికొన్ని లక్షల ఓట్లు ఉండటం హైదరాబాద్ రాజకీయాలపై కొత్త చర్చకు తెరతీసింది. సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తగ్గుదల ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ఎన్నికలు అనగానే ప్రత్యేకంగా చర్చకు వచ్చే అంశాల్లో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఒకటి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక వర్గంగా చాలాకాలంగా చర్చలో ఉంటున్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 15 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం గణనీయంగా ఉందనే అంచనాలు ఉన్నాయి. ప్రతి ఎన్నికల సమయంలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. అయితే ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ?లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగించడం మరికొన్ని ఓట్లను పెండింగ్‌లో ఉంచడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను తొలగించారు. వీళ్లను లో పెట్టారు. అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన వారు, తొలగించబడిన లేదా డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి ఓట్లు ఈ కేటగిరీలోకి వెళ్లాయి. అంటే.. మళ్లీ అప్లై చేసుకుంటే తప్ప ఈ ఓట్లు లేనట్లే. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73 లక్షల ఓట్లు పోయాయంటే.. మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి బయటకు వెళ్లినట్టవుతుంది. తర్వాత తెలంగాణ ఓటర్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు మిగిలాయి. అయితే ఈ ఓట్లన్నీ పూర్తిగా ధృవీకరించినవని చెప్పలేమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. మరో 92,87,577 ఓట్లను విత్ హెల్డ్ కేటగిరీలో ఉంచారు. ఈ ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో వాలిడేషన్ పూర్తికాలేదని చెబుతున్నారు. అంటే తెలంగాణలో తొలగించబడిన 73 లక్షల ఓట్లతో పాటు మరో దాదాపు 93 లక్షల ఓట్లు కూడా ప్రస్తుతం తుది స్థితిలో లేవు. తొలగించిన, పెండింగ్‌లో ఉంచిన ఓట్లను కలిపితే ఈ సంఖ్య దాదాపు 1.66 కోట్లు. అంటే తెలంగాణ మొత్తం ఓటర్లలో దాదాపు సగం ఓట్లు ఏదో ఒక రకంగా ప్రభావానికి లోనైనట్టుగా కనిపిస్తోంది. ఇక్కడే అసలు కీలకమైన విషయం బయటకు వస్తోంది. తెలంగాణలో కేటగిరీలోకి వెళ్లిన 73 లక్షల ఓట్లలో 43 లక్షల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోనే ఉన్నాయని లెక్కలు సూచిస్తున్నాయి. అంటే తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలగించబడిన ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈ మూడు జిల్లాల్లో మరో 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అంటే తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ఆమోదించబడని ఓట్లలో దాదాపు 83 లక్షలు కేవలం ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. ఇక్కడి నుంచే కేవలం ఓటర్ల లెక్కలకు సంబంధించిన అంశమేనా? లేక హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా? అనే ప్రశ్న మొదలవుతోంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇందులో 43 లక్షల ఓట్లు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని దాదాపు 37 శాతం ఓట్లు ప్రభావితమయ్యాయి. తెలంగాణలో నమోదైన ప్రతి 100 ఓట్లలో దాదాపు 59 ఓట్లు హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదు హైదరాబాద్ ఒక మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ మార్పులు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ వంటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మొత్తంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 చోట్ల ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ తిరిగి ఇవ్వని వారి శాతం కూడా గమనించదగ్గ స్థాయిలో ఉంది. సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్‌బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి ఇవ్వలేదని లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పలేం కానీ.. ఈ నియోజకవర్గాల పరిధిలో ఆంధ్రా ప్రజలు ఎక్కువుగా ఉంటున్నారన్నది నిజం.

వాళ్లలో మెజారిటీ ఆంధ్రా ప్రాంతంలోనే ఓటుహక్కును కొనసాగించుకున్నారు. ఈ విషయంలు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తెలిసింది. చాలా కాలనీల్లో " మేం మా ఊళ్లలోనే ఓటును కొనసాగించుకుంటాం" అని చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల తగ్గుదల గణనీయంగా కనిపిస్తోంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా, దాదాపు 42 శాతం ఓట్లు తగ్గిన నియోజకవర్గంగా ఇది నిలిచింది. ఆ తర్వాత ఎల్‌బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఒక నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు తగ్గాయి అన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యం కాదు. ఎవరి ఓట్లు తగ్గాయి? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం ప్రతి పార్టీపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపదు. ఈ మూడు జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది. పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న హైదరాబాద్ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు.

వారిలో దాదాపు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం ఓటర్లపై ప్రభావం పడినట్టుగా కనిపిస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో అనేక మంది ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించలేకపోవడం వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. డాక్యుమెంట్లు ఇచ్చిన వారిలో కూడా 12లక్షల మందికి ఇక్కడ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే తొలగించబడిన ఓట్లతో పాటు మరో భారీ సంఖ్యలో ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు వెళ్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. పత్రాల్లో తప్పులు, 2002 మ్యాపింగ్‌తో సరిపోని వివరాలు వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు.

ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని ఓట్లు తుది జాబితాలోకి వస్తాయి? అనేది తదుపరి ప్రక్రియలో తేలాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 12లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తొలగించిన ఓట్లకు ఇవి అదనం.

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్స్... రాజకీయంగా కొంత ప్రభావం చూపించారు. వీరిలో కొంతమంది ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారున్నారు. ఇప్పుడు ఓట్ల రివిజన్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోనుందా అన్న చర్చ మొదలైంది. ఇక్కడ సెటిలైన వారు.. హైదరాబాద్ ఓటర్లుగా పూర్తిగా మారారా?లేక... "మా ఓటు సొంత రాష్ట్రంలోనే కొనసాగాలి" అని నిర్ణయించుకున్నారా? అనే ప్రశ్న వస్తోంది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే ఒక ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడుతుంది.

"హైదరాబాద్‌లో ఆంధ్రా జనాభా కనిపిస్తుంది. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు." ఇది హైదరాబాద్‌లోని రాజకీయ పార్టీలకు కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అభిప్రాయం కూడా పూర్తిగా సరైంది కాదు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంత మొగ్గు ఆ పార్టీ వైపు ఉండేదనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కానీ ఇప్పుడు తెలంగాణ రాజకీయ పరిస్థితి మారిపోయింది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పోటీ తెలంగాణకు చెందిన పార్టీల మధ్యనే సాగుతోంది. అందువల్ల ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ఏ పార్టీకి ఎంత నష్టం? ఏ పార్టీకి ఎంత లాభం? అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పడం కష్టం. ూఎఖ్ ప్రక్రియ కేవలం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మాత్రమే. అయితే కేవలం మూడు జిల్లాల పరిధిలోనే దాదాపు 80లక్షల ఓట్లు తొలగిపోవడం, పెండింగ్‌లో ఉండటం అనేది.. చిన్న విషయం కాదు. ఇది భవిష్యత్‌లో రాజకీయంగా తీవ్ర ప్రభావాన్ని చూపించే అంశం. ముఖ్యంగా ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్యలో వచ్చిన మార్పులతో రాజకీయ పార్టీలు తమ ప్లానింగ్ మార్చుకోవలసి పరిస్థితి. ఇక ఏ ప్రభావాలకు లొంగని పాతబస్తీ ప్రాంతం కూడా ఈ?సారి కుదుపునకు గురైంది. ప్రత్యేకంగా ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో 35శాతం ఓట్లు తగ్గిపోయాయి. ఏకపక్ష మెజార్టీలతో గెలుస్తున్న కు ఇది కాస్త ఇబ్బందికరమే. ఇది గెలుపుపై ప్రభావం చూపకపోయినా.. మిగిలిన పార్టీలకు పోటీ ఇవ్వడానికి అవకాశం కల్పిస్తుంది. ఆంధ్రావాళ్ల ఓట్లన్నీ తెలంగాణ నుంచి వెళ్లిపోయావా..కు భారీ గండి పడబోతోందా అన్నది తుది ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతనే తేలనుంది.

## బిజినెస్

### రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!



సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహ్ అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది. ఈ జీతం తక్కువ ఆదాయంతో జీవించే స్థాయి నుంచి బయటపడటానికి సరిపోతుంది. కానీ.. ఖరీదైన జీవనశైలిని ఎలాంటి ఆలోచన లేకుండా కొనసాగించడానికి మాత్రం సరిపోదు. అంటే.. జీతం బాగానే ఉంటుంది, కానీ నెలాఖరుకు బ్యాంక్ బ్యాలెన్స్ చూస్తే మాత్రం నిరాశే మిగులుతుంది.

**పెద్ద నగరాల్లో ఖర్చులు**

ఇక్కడ ప్రధాన సమస్య జీవన వ్యయం. టైర్-1 నగరాల్లో ఇంటి అద్దె ఒక్కటే జీతంలో పెద్ద భాగాన్ని తీసుకుపోతుంది. దానికి తోడు కరెంట్, ఇంటి ఖర్చులు, కారు లేదా బైక్ ఈఎంఐ, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం, బయట తినడం, షాపింగ్ ఇలా ఒక్కో ఖర్చు కలుస్తూ పోతుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షలు జీతం వస్తే.. అందులో రూ.30-40 వేలు ఇంటి అద్దెకే వెళ్లొచ్చు. పిల్లలున్న కుటుంబాల్లో స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు అదనంగా ఉంటాయి. కారు ఈఎంఐ లేదా హోమ్ లోన్ ఉంటే మరో పెద్ద మొత్తం అక్కడే పోతుంది. చివరికి పొదుపు చేయడానికి అనుకున్న డబ్బు చాలా తక్కువగా మిగలొచ్చు.

**జీతం పెరిగితే ఖర్చులు కూడా**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్. జీతం పెరిగినప్పుడు మన అవసరాలు మాత్రమే కాదు.. మన కోరికలు కూడా పెరుగుతాయి. మంచి జీతం రావడంతో ఖరీదైన ఇల్లు, కొత్త కారు, ఎక్కువ ట్రావెల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ వస్తువులు ఇలా ఖర్చులు పెరగొచ్చు. మొదట్లో ఇవన్నీ చిన్న ఖర్చుల్లానే అనిపిస్తాయి. కానీ నెలాఖరుకు చూస్తే మొత్తం పెద్దదైపోతుంది. అందుకే కొంతమందికి జీతం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెరిగినా.. పొదుపు మాత్రం పెద్దగా పెరగదు.

**ఇతరులతో పోల్చుకోవడం మరో సమస్య**

సోషల్ మీడియా వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మన చుట్టూ ఉన్నవాళ్లు కొత్త కారు కొంటున్నారు, విదేశాలకు వెళ్తున్నారు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్తున్నారు అని చూసి మనం కూడా అదే స్థాయిలో జీవించాలనుకుంటాం. కానీ వాళ్ల ఆదాయం ఎంత?, వాళ్ల అప్పులు ఎంత?, వాళ్లు ఎంత పొదుపు చేస్తున్నారు?, అనేది మనకు తెలియదు. అయినా వాళ్ల జీవనశైలిని చూసి మన ఆర్థిక పరిస్థితికి సరిపోని ఖర్చులు చేస్తే సమస్యలు మొదలవుతాయి.

**నెటిజన్ల స్పందన**

నిధి కుష్వాహ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు ఆమె చెప్పింది నిజమేనని అన్నారు. తమ స్నేహితులు కూడా ఇలాంటి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కొందరు చెప్పారు. అయితే.. మరికొందరు మాత్రం సమస్య జీతంలో కంటే మన ఖర్చు చేసే విధానంలో ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మనకు నిజంగా ఏం అవసరమో తెలుసుకోకుండా ఇతరుల జీవనశైలిని అనుసరించడం ఆర్థికంగా ఇబ్బందులకు దారితీయొచ్చని అన్నారు.

# వైద్య వ్యాపారం భళా..

## విస్తరణ బాటలో ప్రముఖ దవాఖానలు.. ఆంత్రప్రెన్యూర్లుగా డాక్టర్ల దూకుడు

## ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ

## రుణ భారం తగ్గించుకుంటూనే ఆధునీకీకరణ దిశగా అడుగులు

## ఆస్పత్రుల కొనుగోళ్లు, విలీనాలతో నెట్‌వర్క్ పెంచుకుంటున్న బడా గ్రూపులు

**న్యూఢిల్లీ :** కూడు.. గూడు.. గుడ్డ.. ఆ తర్వాత ఈ దేశంలోని కోట్లాది ప్రజల కల ఆరోగ్య సంరక్షణే. ఇదే.. ఇప్పుడు భారతీయ వైద్య రంగాన్ని వేగంగా వృద్ధిపథంలో నడిపిస్తున్నది. ఇక ఆపత్కాలంలో వైద్యం చేయడమే కాదు.. అవసరమైతే ఆంత్రప్రెన్యూర్లుగానూ మారుతామని డాక్టర్లు నిరూపిస్తున్నారు. దీంతో హెల్త్‌కేర్ బిజినెస్ దూసుకుపోతున్నది. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి రావడం కూడా.. ప్రైవేట్ ఆస్పత్రుల విస్తరణకు దోహదం చేస్తున్నది. దేశంలో 60 కోట్లకుపైగా జనాభాకు ఆరోగ్య బీమా ఉన్నట్టు అంచనా. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం ఇదీ సంగతి..

మణిపాల్, అపోలో దగ్గర్నుంచి మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, మేదాంత, పరాస్ హెల్త్, యశోదా హాస్పిటల్స్ వరకు దేశంలోని అన్ని ప్రధాన దవాఖానల గ్రూపులు.. పడకలను పెంచుకుంటూ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశిస్తూపోతున్నాయి. ఈ క్రమంలోనే దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమేగాక, స్టాక్ మార్కెట్ల నుంచీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) ద్వారా పెద్ద ఎత్తున నిధులను సమీకరిస్తున్నాయి. పడకల సామర్థ్యం ప్రకారం దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ నెట్‌వర్క్ అయిన మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్.. జూలైలో రూ.9,275 కోట్ల ఐపీవోను తెచ్చింది. దేశ, విదేశాల్లో దవాఖానల కొనుగోలుకు చేసిన అప్పులను తీర్చేందుకు ఈ నిధులను వినియోగిస్తామని మణిపాల్ చెప్తున్నది. అలాగే అపోలో హాస్పిటల్స్ వచ్చే ఐదేండ్లలో దాదాపు 4,400 బెడ్లను పెంచుకోవాలని చూస్తున్నది. మరోవైపు ఢిల్లీ, ముంబై, గువాహటి, వారణాసి నగరాల్లో విస్తరించి, 2,950 బెడ్లను పెంచుకోవాలని మేదాంత యోచిస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే 3-4 ఏండ్లలో గురుగ్రామ్, లక్నో, ఢిల్లీ, పంజాబ్, భువనేశ్వర్ ప్రాజెక్టుల ద్వారా మ్యాక్స్ హెల్త్‌కేర్ తమ పడకల సామర్థ్యాన్ని 10వేలకుపైగా పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఇక గ్రేటర్ నోయిడాలోని యశోదా మెడిసిటీలో యశోదా గ్రూప్ రూ.2,400 కోట్లను పెట్టుబడిగా పెడుతున్నది. ఫోర్టిస్, పారస్.. ఇలా అనేక ప్రముఖ గ్రూపులు దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికల్ని రచిస్తున్నాయి. పారిశ్రామిక పరికరాలను అద్దెకు తీసుకోవడం

**ఆంత్రప్రెన్యూర్లుగా..**

భారతీయ హాస్పిటల్ బూమ్ కేవలం పెట్టుబడుల ద్వారానే



రాలేదు. దీని వెనుక దేశంలోని అతిపెద్ద హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్ల పెద్దలున్నారు. డాక్టర్లుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి.. ఇప్పుడు విజయవంతమైన దవాఖానల నిర్వాహకులుగా పేరుగాంచారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి (అపోలో హాస్పిటల్స్), డాక్టర్ నరేశ్ ట్రెహాన్ (మేదాంత), డాక్టర్ దేవీ శెట్టి (నారాయణ హెల్త్).. ఇలా ఎందరో ఉన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ దూసుకెళ్తున్నారు. ఈ వరుసలో హైదరాబాద్ ఆధారిత, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఒక అడుగు ముందే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశంలోని ఫార్మా కంపెనీల్లో ఎక్కువగా ఇక్కడే ఉండటం కూడా కలిసొస్తున్న అంశంగా ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హాస్పిటల్స్ విస్తరణతో వైద్యులు, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరత్రా మెడికల్ సిబ్బందికి ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయని అంటున్నాయి.

2021-22 నుంచి ఇప్పటిదాకా ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల ద్వారా వివిధ ఆస్పత్రులు రూ.55,000-60,000 కోట్ల నిధులను సమీకరించినట్టు కేర్ రేటింగ్స్ అంచనా.

2030నాటికి అదనంగా మరో 38,000కుపైగా పడకల సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూస్తున్న ప్రధాన హాస్పిటల్ గ్రూపులు. ఇందుకు రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశం.

యశోదా హాస్పిటల్స్ ఐపీవోకు సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.3,000-4,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా రావచ్చన్న అంచనాలు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన అపోలో, యశోదా, కిమ్స్, కేర్, కామినేని, ఏఐజీ, రెయిన్‌బో హాస్పిటల్స్ గ్రూపులు.. దేశవ్యాప్తంగా, తొలుత దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరణ దిశగా అడుగులు.

గడిచిన ఐదేండ్లలో తమ నెట్‌వర్క్‌లోకి 31 చిన్న ఆస్పత్రులను చేర్చుకున్న మణిపాల్ హెల్త్. అపోలో, కిమ్స్ తదితర సంస్థలూ ఇతర ఆస్పత్రులను హస్తగతం చేసుకోవడం, భాగస్వామ్యంగా చేర్చుకోవడం చేస్తున్నాయి. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం

టై-అప్‌ల ద్వారా కొత్త ప్రాంతాల్లోకి, నూతన వైద్య సేవల్లోకి వెళ్తున్న బడా కార్పొరేట్ ఆస్పత్రులు. సంయుక్తంగా దవాఖానలను నిర్వహిస్తూ లాభాల్లోకి.

2010లో రూ.12,546గా ఉన్న ప్రైవేట్ దవాఖానల సగటు ఇన్-పేషెంట్ ఖర్చు.. 2023లో రూ.42,600కు చేరిందని చెప్తున్న ఎన్ఎస్ఎస్‌వో గణాంకాలు.

దేశంలోని మెట్రో నగరాలు, ప్రధాన నగరాలకే పరిమితం కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో విస్తరణపట్ల కూడా ఆసక్తి చూపుతున్న బడా హాస్పిటల్ గ్రూపులు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా బ్యాటర్..

# ప్రపంచంలోనే రెండో ప్లేయర్‌గా

చేతేశ్వర్ పుజారా రిటైర్మెంట్ తర్వాత టెస్టుల్లో భారత జట్టుకు మూడో స్థానం పెద్ద సమస్యగా మారిన సంగతి తెలిసిందే. సాయిసుదర్శన్, కరుణ్ నాయర్ వంటి ఆటగాళ్లను ప్రయోగించినప్పటికి పుజారా స్థానాన్ని భర్తీ చేయలేకపోయాడు. అయితే ఎట్టకేలకు పుజారా వారుసుడు దొరికాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అద్భుతాలు చేస్తున్నాడు. అతడే కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్. దాదాపు మూడేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన పడిక్కల్ శతకాల మోత మోగిస్తున్నాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో సెంచరీతో సత్తాచాటిన పడిక్కల్.. ఇప్పుడు కొలంబోలో కూడా అద్భుత శతకంతో కదం తొక్కాడు. 193 బంతుల్లో 12 ఫోర్లతో 117 పరుగులు చేశాడు. ఈ క్రమంలో పడిక్కల్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఒకే సిరీస్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఇంతకుమందు ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు రూట్ సరసన పడిక్కల్ చేరాడు. అంతేకాకుండా విదేశీ గడ్డపై భారత జట్టు తరఫున మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వరుసగా సెంచరీలు చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. చివరగా 2018-19 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పుజారా వరుసగా



రెండు సెంచరీలు చేశాడు. మళ్లీ ఇప్పుడు ఏడేళ్ల తర్వాత ఈ ఫీట్‌ను దేవ్‌దత్ నమోదు చేశాడు.

### ఈస్ట్ బెంగాల్‌దే డ్యూరండ్ కప్..

### 22 ఏండ్ల తర్వాత ట్రోఫీ సొంతం

**కోల్‌కతా :** ప్రతిష్టాత్మక డ్యూరండ్ కప్‌లో ఈస్ట్ బెంగాల్ రెండు దశాబ్దాల తర్వాత ట్రోఫీ గెలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు.. 4-1తో తమ చిరకాల ప్రత్యర్థి మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించి 22 ఏండ్ల తర్వాత మళ్లీ డ్యూరండ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ఆ జట్టు తరఫున ఎడ్మండ్ లాల్రిండికా (12వ, 22వ, 44వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా బిపిన్ (10వ) ఒక గోల్ చేశాడు. 2004లో బెంగాల్.. 2-1తో మోహన్ బగాన్‌ను ఓడించి టైటిల్ గెలిచిన అనంతరం మళ్లీ ఆ జట్టు ఈ ట్రోఫీని నెగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ట్రోఫీతో డ్యూరండ్ కప్‌ను అత్యధిక సార్లు గెలుచుకున్న జట్టుగా ఈస్ట్‌బెంగాల్.. మోహన్ బగాన్(17)తో సమానంగా నిలిచింది.




## స్పోర్ట్స్

### 9వ స్థానంలో బ్యాటింగ్.. కట్ చేస్తే!

### 5ఫోర్లు, 5 సిక్సర్లతో విధ్వంసం



బెంగళూరు వేదికగా వెస్ట్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ ఫాస్ట్ బౌలర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ అన్షుల్ కాంబోజ్ బ్యాట్‌తో విరుచుకుపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ 165 పరుగులే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కాంబోజ్ ప్రత్యర్ధి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. వన్డే ఫార్మాట్‌ను తలపిస్తూ కేవలం 52 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 60 పరుగులు చేశాడు. తొమ్మిది బ్యాటింగ్‌కు వచ్చిన కాంబోజ్ ఈ తరహా విధ్వంసం సృష్టిస్తాడని వెస్ట్ జోన్ బౌలర్లు అస్సలు ఊహించి ఉండరు. తుషార్ దేశ్‌పాండే, తనుష్ కొటియాన్ వంటి స్టార్ బౌలర్లను సైతం అన్షుల్ వదల్లేదు. ఫలితంగా నార్త్ జోన్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు ఆలౌటైంది. నార్త్‌జోన్ బ్యాటర్లలో కాంబోజ్‌తో పాటు అయూశ్ బదోని(51),ఆయుష్ దోసేజా(42) రాణించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. వెస్ట్ జోన్ బౌలర్లలో తనీష్ కోటియన్, దేశ్‌పాండే తలా నాలుగు వికెట్లు సాధించారు. ఇక బ్యాటింగ్‌లో సత్తాచాటిన అన్షుల్.. బౌలింగ్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి. మొదటి రోజు ఆటలో అతడికి బౌలింగ్ చేసే అవకాశం రాలేదు.

# మధుబాలగా మారేందుకు?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ప్రకటించిన నాటినుంచీ.. మధుబాలగా మెప్పించే హీరోయిన్ ఎవరు? అనే ప్రశ్న బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ పాత్రలో ఫలానా హీరోయిన్ నటించనున్నదంటూ పలు హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి. అయితే.. చివరకు మధుబాల పాత్రకు 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. నటన, హావభావాలు, డ్యాన్స్ మూమెంట్స్, శరీరక భాష.. ఇలా అన్ని విషయాల్లోనూ మధుబాలను తలపించేందుకు సారా కఠినంగా శ్రమిస్తున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నదట. సంజయ్‌లీలా భన్సాలీ సినిమాలు ఎంత గ్రాండియర్‌గా ఉంటాయో తెలిసిందే. ఈ చిత్రాన్ని ఆయన నిర్మిస్తుండగా, జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నారు.






# ఇంటర్వెల్ బ్యాంగ్ భాగ్యనగరంలో?

'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్. తన గత చిత్రాలకు భిన్నంగా, వైవిధ్యమైన కథ, కథనాలతో అత్యంత భారీగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలే ఉన్నాయి. మాఫియా నేపథ్యంలో ఓ డాన్ చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని సమాచారం. సైన్స్ ఫిక్షన్ అంశాలు కూడా ఈ కథలో ఉన్నట్టు వినికిడి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. ఈ షెడ్యూల్ అనంతరం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో మరో షెడ్యూల్‌ని దర్శకుడు అట్లీ ప్లాన్ చేశారు. దీనికోసం ఓ భారీ సెట్‌ని కూడా నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ఇంటర్వెల్ బ్యాంగ్‌ని చిత్రీకరిస్తారట. అలాగే, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తీస్తారని తెలిసింది. దీపిక పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మృణాళ్‌ఠాకూర్, జాన్వీ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పాన్‌ఇండియా సినిమాను నిర్మిస్తున్నది.



# స్వరాన్వేషణలో... 50 భాషల్లో 'వారణాసి' విడుదల

తెరపై కనిపించే తారలు వేరు... వాళ్లు పలికే సంభాషణలు పలికేవాళ్లు వేరు. మరి... తెరపై కనిపించే వ్యక్తి హావభావాలకు తగ్గట్టుగా సంభాషణలు పలికే వ్యక్తి కంఠస్వరం ఉండాలి కదా. ప్రస్తుతం రాజమౌళి అలా మ్యాచ్ అయ్యే 'వాయిస్'ల కోసం అన్వేషిస్తున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసమే రాజమౌళి దాదాపు పదిహేను వందల మంది వాయిస్ ఆర్టిస్ట్‌లను పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పించాలని అనుకుంటున్నారట. ఇంతకీ 1500 మంది ఆర్టిస్ట్‌లు ఎందుకు అంటే... 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని టాక్. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మిగతా భాషల్లోనూ అనువదించి, విడుదల చేస్తారు. సో... పాత్రలకు సరిగ్గా సరి పోయే గొంతులను ఎంపిక చేసి, ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పించాలనుకుంటున్నారట. ఇన్ని వాయిస్‌లంటే ఏఐ ద్వారా కూడా చేయొచ్చు. కానీ, భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించాలనుకుంటున్నారట. అందుకే 'రియల్ వాయిస్'లను ఎంపిక చేయాలనుకుంటున్నారని భోగట్టా. రాజమౌళి టీమ్ ప్రస్తుతం ఈ ఆడిషన్స్ చేసే పని మీద ఉందని తెలిసింది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొత్తం 120 దేశాల్లో 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512